ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.0
కనిష్ఠం 21.0
ANDHRAJYOTHY



108 ఈఎంటీ, పైలెట్‌లకు ఇంటర్వ్యూలు

భువనగిరి రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): 108 అంబులెన్స్‌లో మెడికల్ టెక్నీషియన్లు, పైలెట్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం భువనగిరిలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా 108 జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ నసీరొద్దిన్, జిల్లా ఇన్‌చార్జి మహేశ్ కుమార్ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. యాదాద్రి భువనగిరి, జనగాం జిల్లాల్లో ఖాళీగా ఉన్న 15 పైలెట్, 15 ఈఎంటీ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. పైలెట్ పోస్టులకు 18మంది, ఈఎంటీ పోస్టులకు 18 మంది హాజరయ్యారు. వీరిలో మెరిట్, నైపుణ్యాన్ని బట్టి 15మందిని ఆయా పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశారు.

న్యూస్ బాక్స్

సీఎం రేవంత్‌రెడ్డిని దించే దమ్ముందా..?

కేటీఆర్‌ను ప్రశ్నించిన ఎమ్మెల్యే సామేలు



మాట్లాడుతున్న మందుల సామేలు

మోత్కూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిని, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివా‌స్‌రెడ్డిని దించే దమ్ము ఎవరికి ఉందో చెప్పాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు సవాల్ విసిరారు. బుధవారం మోత్కూరు రహదారి బంగ్లాలో మోత్కూరు, అడ్డగూడూరు మండలాలకు చెందిన 31మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.13.31లక్షల చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి శ్రీనివా‌స్‌రెడ్డి పదవులు ఊడతాయని కేటీఆర్ వ్యాఖ్యానించడాన్ని ప్రస్తావిస్తూ ఆ దమ్ము ఎవరికి ఉందో చెప్పాలన్నారు. సీఎం, రెవెన్యూ మంత్రులను కదిలించగలరా? అని ఆయన ప్రశ్నించారు.రాష్ట్రం ఏర్పాటుకు ముందు కేసీఆర్, కేటీఆర్, హరీ‌శ్‌రావు, కవిత ఆస్తులు ఎన్ని, నేడు వారి ఆస్తులు ఎంత పెరిగాయో, అవి ఎలా వచ్చాయో ప్రజలు గమనిస్తున్నారన్నారు. కార్యక్రమాల్లో గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డి, పేలపూడి వెంకటేశ్వర్లు, రామచంద్రు, అవిశెట్టి అవిలిమల్లు, బాలరాజు పాల్గొన్నారు.



బాలలకు బంగారు బాల్యాన్నిద్దాం

ప్రభుత్వాలు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నా బాల్యవివాహాల వంటి సాంఘిక దురాచారాలు నేటికీ కొనసాగుతున్నాయి. ఆడ, మగ పిల్లల మధ్య వ్యత్యాసాలు అలాగే ఉన్నాయి. నేటి బాలలే రేపటి పౌరులు, బాలబాలికలిద్దరూ సమానమేననే నినాదం మాటలకే పరిమితమైంది. జిల్లాలో గత 14 ఏళ్లుగా ప్రభుత్వం సంరక్షించిన బాలల్లో బాలికల శాతమే ఎక్కువగా ఉండడమే ఇందుకు నిదర్శనం. జిల్లాలో 2011 నుంచి ఇప్పటివరకు వేర్వేరు దురాగాతాల నుంచి కాపాడిన బాలలు 1,597 మంది ఉంటే, వారిలో బాలికలే 1187 మంది ఉండడం వివక్ష, వేధింపులు, హక్కుల హననంలో బాలికలే ఎక్కువ బాధితులుగా ఉన్న విషయం రూఢీ అవుతోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి- నల్లగొండ)

- ఇంకా కొనసాగుతున్న సాంఘిక దురాచారాలు
- బాల్యవివాహాలు, బాల కార్మికవ్యవస్థతో బందీ అవుతోన్న పిల్లలు
- నేడు జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా..

బాలబాలికల సంరక్షణకోసం ప్రభుత్వాలు ఎన్నో పథకాలను అమలు చేస్తున్నా, ఎన్నో చట్టాలు ఉన్నా ప్రజల్లో చైతన్యం లేకపోవడం, దారిద్ర్యం, మూఢనమ్మకాలవంటి ప్రభావాలతో బాలలహక్కుల హననం కొనసాగుతోంది. బాలబాలికలకు యుక్తవయసు వచ్చేంతవరకు వారికి హక్కులు, భద్రత, రక్షణ, చదువు, పౌష్టికాహారం, విజ్ఞానాన్ని అందించడాన్ని బాధ్యతగా తీసుకున్న ప్రభుత్వం జిల్లాలోనూ పలు పథకాలు, కార్యక్రమాలను అమలు చేయడం ద్వారా బాలలహక్కుల పరిరక్షణకు తోడ్పడుతోంది. గత పదేళ్లతో పోల్చుకుంటే బాలలహక్కుల హననాన్ని చాలావరకు తగ్గించగలిగామని, ప్రజలంతా ఈ విషయంలో చైతన్యవంతులైతే ఉన్నత ఫలితాలొస్తాయని అధికార యంత్రాంగం చెబుతోంది. బాలల దినోత్సవం సందర్భంగా జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణ కార్యక్రమాలు, అనాథ పిల్లల సంరక్షణ చర్యలు, పోషకాహార సరఫరాకు తీసుకుంటున్న చర్యలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం

జిల్లాలో ప్రభుత్వం చేరదీసిన పిల్లల సంఖ్య 1597 మంది

జిల్లాలో 2011లో బాలల హక్కుల పరిరక్షణ సమితిని ఏర్పాటుచేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు 1,597 మందిని ప్రభుత్వం వేర్వేరు ఇబ్బందుల నుంచి సంరక్షించి వారిని కాపాడింది. వీరిలో ప్రధానంగా బాల్యవివాహాల బారినుంచి రక్షించగా, లైంగికదాడులకు గురైన వారు, బాలకార్మికులు, పాక్షిక అనాథలు, తల్లిదండ్రులు వదిలేసిన పిల్లలున్నారు. ఈ ఒక్క ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 21మందిని బాల్యవివాహాల బారినుంచి కాపాడితే, మరో 21 మంది బాలకార్మికులను గుర్తించి సంరక్షించారు.

అనాథలను సంరక్షించేందుకు..

వేర్వేరు కారణాలతో అనాథలైన పిల్లలను సంరక్షించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. అనాథలు, పాక్షిక అనాథలు, వేధింపులకు గురైన పిల్లలు, ఇతరత్రా బాధితులైన పిల్లలను చేరదీసి వారిని సంరక్షించే నిమిత్తం జిల్లాలో ఎనిమిది అనాథ శరణాలయాలు కొనసాగుతున్నాయి. వీటిలో రెండింటిని ప్రభుత్వం నిర్వహిస్తుంటే, మిగిలిన ఆరింటిని స్వచ్ఛంద సేవాసంస్థలు నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే బాలసదనంలో బాలికలకు వసతి కల్పిస్తుంటే, శిశుగృహలో బాలలబాలికలకు సంరక్షణ కల్పిస్తున్నారు. ఎన్జీవోల ఆధ్వర్యంలో నడిచే అనాథాశ్రమాలు ఆరింటిలో నాలుగు బాలికలుద్దేశిస్తే, మిగిలిన రెండింటిలో బాలురకు వసతి, విద్యాబోధన అందిస్తున్నారు. జిల్లా శిశుగృహలో ఆరుగురు పిల్లలు ప్రస్తుతం ఆశ్రయం పొందుతుంటే, బాలసదనంలో 31మంది బాలికలున్నారు. మిగిలిన ఆరింటిలో 129 మంది బాల, బాలికలున్నారు.

చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098 ద్వారా 24గంటల సేవలు

పిల్లలు ఏ సందర్భంలోనైనా, ఏక్షణంలోనైనా వేధింపులకు పాల్పడ్డా, బాధించబడుతున్నా, లేక వదిలేయబడినా అలాంటివారిని సంరక్షించే నిమిత్తం ప్రభుత్వం చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098ని అందుబాటులోకి తెచ్చింది. జిల్లా కేంద్రంలోని శిశురక్ష కార్యాలయం నుంచే

మిగతా 7వ పేజీలో..

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

డీఈవో సత్యనారాయణ



మాట్లాడుతున్న డీఈవో సత్యనారాయణ

భువనగిరి టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో కే.సత్యనారాయణ అన్నారు. బుధవారం భువనగిరిలో నిర్వహించిన ప్రైవేట్ పాఠశాలల, ప్రభుత్వ గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 2025లో జరగనున్న వార్షిక పరీక్షలకోసం ప్రతీ విద్యార్థిపై ఉపాధ్యాయులు వ్యక్తిగత శ్రద్ధ చూపాలన్నారు. డిసెంబరు 4న నిర్వహించే నాస్ పరీక్షలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ ఏడీ ఎస్.ప్రశాంత్‌రెడ్డి, డీసీఈబీ కార్యదర్శి పాండునాయక్, పరీక్షల సహాయ కమిషనర్ రఘురాంరెడ్డి, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు శ్రీనివాసులు, నరహరి పాల్గొన్నారు.

నియమాల తోరణం

- జిల్లా వ్యాప్తంగా కార్తీక సందడి
- నిత్య పూజలతో ఆధ్యాత్మిక వాతావరణం



6

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

చౌటుప్పల్ జడ్జి మహంతి వైష్ణవి



గురుకుల పాఠశాలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న జడ్జి మహంతి వైష్ణవి

చౌటుప్పల్ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి, విజయాలు అందుకోవాలని చౌటుప్పల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మహంతి వైష్ణవి అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాల కమ్ జూనియర్ కళాశాలలో జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు జడ్జి బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ చట్టం ముందు అందరూ సమానమేనని, సమస్యలను తమ దృష్టికి తెస్తే పరిష్కారం చూపిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని, విద్యలో ఉత్తమ ఫలితాలు సాధించాలని, తల్లిదండ్రులు, గురువుల కలలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.సరోజనమ్మ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు టి.పరమేష్, ప్రధాన కార్యదర్శి రాపోలు వేణు, సీనియర్ న్యాయవాదులు బాల్యం వెంకటాచలపతి, ఎ.శ్రీనివాస్, జల్లా రమేష్, జక్కర్తి శేఖర్, సత్యనారాయణ, జంగయ్య, మోహన్, ఎండీ ఖయ్యూమ్ పాషా పాల్గొన్నారు.

సీఎం రెచ్చగొట్టే మాటలతోనే అధికారులపై దాడులు

మాజీ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సునీత, క్యామ మల్లేశం

భువనగిరి టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విపక్షంలో ఉన్నప్పుడు, ముఖ్యమంత్రి అయ్యాక కూడా రేవంత్‌రెడ్డి హింసను, దాడులను ప్రేరేపించేలా మాట్లాడుతున్న మాటలతోనే ప్రజలు కలెక్టర్ స్థాయి అధికారులపై దాడులకు దిగుతున్నారని మాజీ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్రనేత క్యామ మల్లేశం అన్నారు. బుధవారం భువనగిరిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. లగచర్ల ఫార్మ పరిశ్రమ జనాభిప్రాయ సేకరణలో ప్రజలు కలెక్టర్, అధికారులపై విచ్చలవిడిగా దాడులు చేయడాన్ని బీఆర్ఎస్ ఖండిస్తున్నదని, కానీ ఆ దాడులకు అసలు కారణం సీఎం ప్రసంగాలేనని, దీంతో రాష్ట్రంలో యథారాజా.. తథా ప్రజా పరిస్థితి నెలకొందన్నారు. సమవాఏశంలో సమావేశంలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, రచ్చ శ్రీనివా‌స్‌రెడ్డి, నీలా ఓంప్రకాష్, మాజీ ఎంపీపీ అతికం లక్ష్మీనారాయణగౌడ్, సుబ్బారు బీరు మల్లయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రూప్-3 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- 15 పరీక్షా కేంద్రాలు.. 6043 మంది అభ్యర్థులు
- కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- కలెక్టర్ ఎం.హనుమంతరావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి (కలెక్టరేట్), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్‌తో కలిసి సంబంధిత అధికారులకు ట్రైనింగ్ కమ్ కో ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. బయో మెట్రిక్ విధానంపై అధికారులకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. నూరుశాతం బయోమెట్రిక్ హాజరును తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఈ నెల 17న, 18న జరిగే గ్రూప్-3 పరీక్షలకు జిల్లాలో 3,240 పురుషులు, 2,803 మహిళలు మొత్తం 6043 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని, వారి కోసం 15 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణకు జిల్లాలో 15మంది చీఫ్ సూపరింటెండెంట్, 46 మంది బయోమెట్రిక్ అధికారులు, 17 మంది అబ్జర్వర్లు, ముగ్గురు జాయింట్ రూట్ అధికారులు, ఐదుగురు ఐదుగురు స్క్వాడ్, 15మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 65మంది ఐడెంటిఫికేషన్లతోపాటు 253మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. పరీక్ష 17న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పేపర్-1, సాయంత్రం 3గంటల నుంచి 5.30గంటల వరకు పేపర్-2, 18న ఉదయం 10గంటల నుంచి 12.30గంటల వరకు పేపర్-3 ఉంటుందన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ఉదయం 8.30గంటల వరకు, మధ్యాహ్నం పరీక్షకు 1.30వరకు చేరుకోవాలన్నారు. నిర్దేశించిన సమయం తర్వాత అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమన్నారు. టీజీపీఎస్పీ గ్రూప్-3 పరీక్షలు సజావుగా సాగేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో భువనగిరి ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్ రెడ్డి, యాదగిరిగుట్ట ఏసీపీ సైదులు, జాయింట్ కస్టోడియల్ చీఫ్ సూపరిండెంట్లు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

రాజాపేట: విధుల్లో ఉద్యోగులు నిర్లక్ష్యం వహించినా, సమయపాలన పాటించకపోయినా చర్యలు తప్పవని కలెక్టర్ హనుమంతరావు హెచ్చరించారు. బుధవారం మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూను పాటిస్తున్నారా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

కల్యాణం.. కమనీయం

నేత్రపర్వంగా మత్స్యగిరీశుడి పరిణయ వేడుక



తాళిబొట్టు చూపుతున్న అర్చకులు

వలిగొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం గ్రామ పంచాయతీ పరిధిలో మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి గుట్టపైన బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వయంభు మత్స్యగిరీశుడి కల్యాణ వేడుకలు బుధవారం నేత్రపర్వంగా సాగాయి. ఆగమశాస్త్రం ప్రకారం స్వామివారి కల్యాణ వేడుకలు నిర్వహించారు. కల్యాణ మండపాన్ని పచ్చని తోరణాలు, పుష్పాలతో అందంగా అలంకరించి వేద పండితుల ప్రవచనాల నడుమ కల్యాణ వేడుక సాగింది. స్వామివారికి పట్టు పీతాంబరాలు మంగళసూత్రం, ముత్యాల తలంబ్రాలను దేవస్థానం తరఫున ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, దేవస్థానం చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్ కుమార్‌రెడ్డి, దేవస్థాన ఈవో మోహన్‌బాబు అందజేశారు.

చూడముచ్చటగా కల్యాణ వేడుకలు



మత్స్యగిరి నరసింహస్వామి కల్యాణం లక్ష్మీదేవి అమ్మవారితో ప్రత్యేక మండపంలో వేద మంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా సాగింది. ముక్కోటి దేవతలు ఆహుతులుగా, సృష్టికర్త బ్రహ్మదేవుడి సమక్షంలో నృసింహుడు లోకకల్యాణార్థం సకల సంపదలకు నెలవైన అమ్మవారి మెడలో బుధవారం శుభముహూర్తంలో మాంగల్యధారణ చేశారు. పట్టువస్త్రాలు, స్వర్ణ, వజ్ర, వైఢూర్య ఆభరణాలతో ఉత్సవమూర్తులను ముస్తాబు చేసి, కల్యాణ మండపంపై అధిష్ఠింపజేశారు. లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న కల్యాణం శాస్త్రోక్తంగా విశ్వక్సేనుడి తొలి పూజలతో ఆరంభించారు. వరుడు నారసింహుడికి లక్ష్మీదేవి తండ్రి పాదప్రక్షాళన చేసిన అనంతరం కన్యాదాన తంతు నిర్వహించారు. మత్స్యగిరి బ్రహ్మోత్సవాల్లో ఎదుర్కోళ్ల ఉత్సవం వైభవంగా సాగింది. సిద్ధేంద్రయోగి కూచిపూడి నృత్య కళా బృందం వారిచే సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. కల్యాణ వేడుకల్లో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. వెంకటరమణాచార్యులు, దేవస్థాన చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్‌కుమార్‌రెడ్డి, భువనగిరి మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, ధర్మకర్త లు కరుణాకర్, వెంకటేష్, ప్రభాకర్, అంజయ్య, రవికుమార్, జగన్మోహన్‌రెడ్డి, ఊశయ్య, రాములు, కేతమ్మ, మాజీ రాజ్యసభ సభ్యుడు రాపోలు ఆనందభాస్క ర్, మాజీ ఎంపీపీ నూతి రమేష్‌రాజు, అర్చకుడు యాదగిరి స్వామి, నాయకు లు సత్తిరెడ్డి, కిష్టయ్య, రవి, సతీష్, రాంరెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర నివేదిక రూపకల్పనకు చర్యలు

- కొండపైన వైటీడీఏ అధికారుల పరిశీలన
- సీఎం ఆదేశాలతో అధికారుల అప్రమత్తం



కొండపై ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న అధికారులు


భువనగిరి అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో పెండింగ్‌లో పనులను గుర్తించేందుకు వైటీడీఏ బృందం బుధవారం కొండపైన పరిశీలించింది. ఈ నెల 8న ముఖ్యమంత్రి పుట్టినరోజు సందర్భంగా యాదగిరిగుట్ట క్షేత్ర సందర్శనకు వచ్చి ప్రెసిడెన్షియల్ సూట్‌లో మంత్రులు, వైటీడీఏ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో వచ్చే సమావేశానికి పెండింగ్ పనులపై సమగ్ర నివేదిక రూపొందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈనేపథ్యంలో బుధవారం వైటీడీఏ అధికారుల బృందం కొండపైన ప్రధానాలయం, తిరువీధులు, ఆర్టీసీ బస్టాండ్, పార్కింగ్ ప్రదేశం తదితరాలను పరిశీలించింది. ఎక్కడ పెండింగ్ పనులు ఉన్నాయి? అవి కాకుండా ఇంకా ఏమైనా ఉన్నాయా? అవి పూర్తి చేసేందుకు ఎంతమేర నిధులు కావాలి? ఎప్పటిలోగా పనులు పూర్తి చేయొచ్చు? తదితర అంశాలపై అధికారులు ప్రాథమికంగా చర్చించారు. తుది నివేదిక రూపొందించి సీఎంకు అందజేయనున్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా ఆలయంలోని స్వామివారి ముఖమండపంలోని ప్రతిష్ఠామూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలుచేశారు. అక్కడే ఉన్న ఆలయ ఈవో భాస్కర్‌రావుతో వైటీడీఏ అధికారులు పరిశీలనకు సంబంధించిన పెండింగ్ బిల్లులు, పనులు ఏం ఉన్నాయి? ఎక్కడ ఉన్నాయి? ఇంకా గుర్తించాల్సిన అంశాలు ఏమైనా ఉన్నాయా? అని ఆరా తీశారు. కార్యక్రమంలో సీఈ పుల్లారాజు, సీఈ మోహన్‌నాయక్, రాజేశ్వర్‌రెడ్డి, వసంత్‌నాయక్, సుదర్శన్‌రెడ్డి, పరంజ్యోతి, ఆలయ ఈఈ జిల్లెల దయాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

దక్షిణ భాగం పరిశీలన

ఆలయ దక్షిణ భాగంలో ఇటీవల కుంగిన ఫ్లోరింగ్‌ను వైటీడీఏ అధికారులు పరిశీలించారు. కుంగిన భాగంలో బండలు తొలగించి మట్టి కుంగిందా? బండలు కుంగాయా? కుంగిన భాగాన్ని ఎలా సరి చేయాలి? అని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

చెరువులను ఎడారిగా మార్చొద్దు

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట మండలంలోని చెరువులలోకి వరద నీరు రాకుండా పూడ్చి, చెరువులను ఎడారిగా మార్చవద్దని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం గుట్ట మండలంలోని సైదాపురం గ్రామ సమీపంలోని రియల్టర్లు పూడ్చి వేసిన వాగు నక్షకాల్వ వద్ద రైతులు, ఆయా పార్టీల నేతలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ గత కొన్నేళ్లుగా కాల్వలపై ఆధారపడి బతుకుతున్న తమపై రియల్టర్ల స్వార్థం మూలాన పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. కాల్వలను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు ఎగ్గిడి నర్సయ్య, పులిపాక నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



కాల్వను పరిశీలిస్తున్న రైతులు, నాయకులు

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



అరూరులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెట్టొదని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అరూరు గ్రామపరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులు పండించిన చివరి ధాన్యం గింజ వరకూ కొనుగోలు చేస్తామ ని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భీమా నాయక్, మాజీ ఎంపీపీ నూతి రమేష్, చిట్టెడి జనార్దన్‌రెడ్డి, పాశం సత్తిరెడ్డి, కంకల కిష్టయ్య, నర్సింహ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేకు సహకరించాలి

సమగ్ర ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో ఎమ్మెల్యే కుటుంబసభ్యుల వివరాలను ఎన్యూమరేటర్లకు వివరించారు. సర్వే వల్ల కలిగే ప్రయోజనాన్ని వివరించారు. కార్యక్రమంలో కుంభం అనిల్‌కుమార్ రెడ్డి కుటుంబసభ్యులు, సర్వే అధికారులుతదితరులున్నారు.

70వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

భూదాన్‌పోచంపల్లి: జిల్లావ్యాప్తంగా ఇప్పటికే 70వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, రానున్న 15రోజుల్లో పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తామని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని జూలూరు, పోచంపల్లి తదితర గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మొత్తం 370 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మొత్తం 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం పని చేస్తోందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని మండల స్థాయి అధికారులను ఆయన ఆదేశించారు. ఆయన వెంట భూదాన్‌పోచంపల్లి తహసీల్దారు ఎం మహేందర్‌రెడ్డి, ఎంఆర్ఐ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

బీబీనగర్: ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలోని రాఘవాపురం, లక్ష్మీదేవిగూడెం గ్రామాల్లోని ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలకు వెళ్లి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు.

తెలంగాణ తొలిపొద్దు కాళోజీ



గుట్టలో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ వాడుక భాషలో రచనలు చేసి సాహిత్యరంగంలో విశేషంగా కృషిచేసిన తెలంగాణ తొలిపొద్దు కాళోజీ నారాయణరావు అని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. బుధవారం గుట్టలో కాళోజీ 22వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ యాస, భాషను ఆదరించాలని చెప్పిన ఆయన కవితలు నేటికీ ఆదర్శంగా మారాయన్నారు. పుట్టుక నీది, చావునీది, బతుకంతా దేశానిదని చెప్పిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో మదర్ డెయిరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ ముక్కెర్ల మల్లేశ్, నాయకులు గుండ్లపల్లి భరత్‌గౌడ్, బందారపు భిక్షపతి, ఎరుకల హేమేందర్‌గౌడ్, కీసరి బాలరాజు, మిట్ట రాంచందర్‌గౌడ్, ఎడ్ల రాంరెడ్డి, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.


సంధ్యా సమయం



● సాయం సంధ్య వేళ...

కాషాయవర్ణంలో సూరీడు నేలకు జారుతున్న వేళ.. చీకటి కమ్ముకుంటుండగా అంతా ఇళ్లకు చేరుతున్న సమయం.. మేమూ మీలాగే అంటూ పక్షుల గుంపు గూళ్లకు వెళ్తోంది.. బుధవారం నల్లగొండ జిల్లా పానగల్ సమీపంలోని ఉదయసముద్రం వద్ద నెలకొన్నది సుందర దృశ్యం.

కాలుష్యమయం



● మూసీ కాలుష్యపు నురగలు

ఫొటో కనిపిస్తున్నది పాల పొంగు అనుకుంటే పొరపాటే. అది మూసీ కాలుష్య నురుగు. ఒకప్పుడు తాగునీటి వనరుగా ఉన్న మూసీ కాలక్రమేణా మురుగు ప్రవాహంగా మారింది. కెమికల్ కంపెనీల వ్యర్థ రసాయనాలు కలవడంతో మూసీ నేడు కాలుష్య కాసారంగా మారింది. భూదాన్‌పోచంపల్లిలోని మైసమ్మ కత్వా వద్ద ఈ దృశ్యం బుధవారం కనిపించింది.

జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో జువేరా ప్రతిభ

నల్లగొండ స్పోర్ట్స్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో నల్లగొండకు చెందిన జువేరా కుల్సుమ్ ప్రతిభ కనబరిచింది. మధ్యప్రదేశ్‌లోని విదిషాలో ఈనెల 8 నుంచి 12వ తేదీ వరకు తైక్వాండో పోటీలు నిర్వహించారు. నల్లగొండకు చెందిన జువేరా కుల్సుమ్ 14 సంవత్సరాల బాలిక 18 కిలోల విభాగంలో బంగారు పతకాన్ని అందుకుంది. విజేతగా నిలిచిన క్రీడాకారిణితో కలిసి ఎస్‌జీఎఫ్ కార్యదర్శి దగ్గుబాటి విమల, కోచ్ యూనుస్ కమాల్‌లు బుధవారం ఎస్పీ శరత్‌చంద్రపవార్‌ను కలిశారు. జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించిన క్రీడాకారుడిని అభినందించారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో తృతీయ స్థానం



తృతీయ స్థానం సాధించిన జట్టుకు కాంస్య పతకం అందజేస్తున్న నిర్వాహకులు

నల్లగొండస్పోర్ట్స్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న 68వ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బాలిక రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టు మూడవ స్థానం సాధించింది. బుధవారం నిర్వహించిన పోటీల్లో కరీంనగర్ జట్టుపై జరిగిన పోరులో 2-0 స్కోరుతో తృతీయ స్థానంలో విజయం సాధించి కాంస్య పతకాన్ని అందుకుంది. జట్టు తృతీయస్థానంలో విజయం సాధించడంపై డీఈవో భిక్షపతి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి విమల, హాకీ అసోసియేషన్ కార్యదర్శి కరీం, కోచ్‌లు యావర్, శ్రీనివాస్ జట్టును అభినందించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ టోర్నమెంట్‌కు ఎంపిక

● విద్యార్థినులను అభినందించిన ఉపాధ్యాయులు



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

సంస్థాన్‌నారాయణపురం నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు చెందిన మేకల చరణ్య, కమ్మపాటి నందిని రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్, కళాశాలలో ఉమ్మడి నల్లగొండ ఎస్‌జీఎఫ్ అండర్ 19 అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 200 మీటర్ల విభాగంలో మేకల చరణ్య, 100 మీటర్ల రన్నింగ్ విభాగంలో కమ్మపాటి నందిని అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పోటీల్లో ప్రతిభ కనబరచిన రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఓ.దీప, వ్యాయామ ఉపాధ్యాయుడు కట్ట వెంకటేష్, పాఠశాల కళాశాల అధ్యాపకులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి క్రీడలకు వెళ్లాలని ఆకాంక్షించారు.

మాల ధారణం నియమాల తోరణం

జిల్లాలో కార్తీకమాసంతో అంతటా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఏ గ్రామంలో చూసినా దీక్షా మాలలు ధరించిన స్వాములు దర్శనమిస్తున్నారు. పరమశివునికి ప్రీతికరమైన కార్తీకమాసంతో శివాలయాల్లో కార్తీకదీపాల వెలుగులు ఓ వైపు.... మాలలు ధరించిన (అయ్యప్ప, శివ, ఆంజనేయ) స్వాముల పూజలు భజనలు... మరో వైపు... భక్తులను ఆధ్యాత్మిక సంద్రంలో ఓల లాడిస్తున్నాయి. నిత్యం పూజలు, అర్చనలు, అభిషేకాలు, అన్నదాన సంతర్పణలతో ఆలయాల్లో నిత్యం ధార్మిక వాతావరణం ఉట్టిపడుతోంది. ఆడంబర జీవితాన్ని గడిపే కొందరు కఠోరమైన నియమాలలను ధరించి సాదు జీవితం గడుపుతున్నారు. కులం, మతం, పేద, ధనిక తేడా లేకుండా మాల ధరించిన స్వాములందరూ గురుస్వాముల మార్గదర్శనంలో మండలం(41రోజుల) పాటు పూజలు చేసి ఆయా దేవతామూర్తులకు ఇరుముడులు సమర్పించడం ద్వారా దీక్ష పూర్తి చేసుకోనున్నారు.

- (ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి)





హిందూ మతంలోని పూజా విధానాలు, సనాతన ఆచార సంప్రదాయాలన్నీ అంతిమంగా మనిషి మనుగడ కోసమేనన్నట్లుగా ఉన్నాయి. కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యాలను జయించే ఏకైక సాధనం మాలధారణం. అయ్యప్ప లేదా ఇతర దేవతా మాలలను ధరించి దీక్ష స్వీకరిస్తే భక్తి, ముక్తి మార్గంతో పాటు మంచి నడవడిక పరివర్తనకు దోహదపడే చక్కని బహుళ ప్రయోజనాలను కల్పిస్తుంది. మాల ధరించిన అందరి స్వాముల్లోనూ దేవుళ్లను చూస్తారు. మెడలో మాలముద్ర ఉన్నంత వరకు వారిని అందరూ గౌరవంగా చూస్తారు. మాల ఉన్నన్నీ రోజులు పొందిన గౌరవాన్ని ఆధ్యాత్మికంగా పొందిన స్వానుభవాన్ని మాల తీసిన అనంతరం కూడా ఎంతో మంది భక్తులు తమ సాధారణ జీవితంలో కూడా పాటిస్తూ తమ గౌరవాన్ని పెంచుకునేలా నడుచుకుంటున్నారు. మాలధారణ కుటుంబ వ్యవస్థకు అద్దం పడుతోంది. ఇంట్లో ఏ ఒక్కరూ (ఏ) మాల ధరించినా అందరూ మండలం పాటు దీక్ష నియమాలను అనుకరిస్తారు.

మాలధారులకు నిత్యాన్నదానం

అయ్యప్ప, ఆంజనేయ, శివ మాలలు ధరించిన స్వాములకు 62 రోజుల పాటు (భిక్ష) నిత్యాన్నదానం చేయటానికి కొందరు వేణుగోపాల స్వామి భక్తమండలి సభ్యులు కమిటీగా ఏర్పడి ముందుకొచ్చారు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని వారిజాల వేణుగోపాలస్వామి ఆలయంలో స్వాములకు ప్రతీ రోజు మధ్యాహ్నం పూజ అనంతరం నిత్యం భిక్ష దానం చేసేలా కార్యాచరణ రూపొందించారు. స్వాములకు నిత్యాన్నదానం చేయడం కోసం దాతలను సంప్రదించి వారిని అన్నదానం చేసేందుకు ఒప్పిస్తున్నారు. మాలధారణ చేసిన భక్తులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు.

భక్తి మార్గానికి సోపానం

మాల ధారణలు భక్తి మార్గానికి సోపానాలుగా మా రాయి. ఏదో ఒక విధానంలో దేవతార్చన చేయడం ద్వారా ప్రతీ మనిషిలో భక్తిభావం పెరుగుతోంది. దీంతో పాటు మనిషి వైవిధ్య భరితమైన జీవితాన్ని గడిపేందుకు ఉపకరిస్తుంది. దీక్ష కాలమంతా సమూహ సమాజంలో గడపడం ద్వారా పరస్పరం కష్ట సుఖాలను తెలుసుకుని పరోపకార గుణం అలవర్చుకోవటానికి దోహదపడుతున్నాయి.

సత్యదీక్షకు ప్రతిరూపంగా మోసం చేయాలనే దుష్ట ఆలోచనలను పోగొడుతున్నాయి. సమాజానికి సేవ చేసే గుణాన్ని పెంపొందిస్తాయి. జీవనశైలిలో మార్పు రావడం ద్వారా క్రమశిక్షణ గల జీవితానికి ఉపయుక్తమవుతోంది. వీటితో పాటు మాల ధారణలు, దాన ధర్మాల కూ ఊతమిస్తున్నాయి. ధార్మిక వేడుకల వద్ద జరిగే అన్నప్రసాద వితరణకు ముందుకొచ్చే భక్తులే నిదర్శనం.

నియమ నిష్టలే ప్రధానం



అయ్యప్పస్వామి, దుర్గామాత, ఆంజనేయస్వామి, శివస్వామి దేవతలు ఎవరైనా, ఏ స్వామి మాల ధరించినా వారికి నియమనిష్టలే ప్రధానం. మంచి మనసుతో భక్తిచిత్తంతో మాల ధరించి అంతే భక్తితత్వంతో పూజలు చేయాలి. మాల ధరించడమంటే 41 రోజుల పాటు దీక్ష చేయడమే కాదు. మనలో క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అనుసరించడం, పరివర్తన కోరుకోవడం, భక్తికి బాటలు వేసుకోవడమనే సత్యాన్ని తెలుసుకోవాలి. గురుస్వామి ఉపదేశంతో అతని మార్గదర్శనంలో నియమాలను పాటిస్తూ దీక్ష పూర్తిచేస్తేనే సంకల్పం సిద్ధించనుంది.

- బెల్లి వెంకన్న, గురుస్వామి

సన్మార్గం వైపు నడిపించేదే మాలధారణ



తెలిసో..తెలియకో...చేసిన తప్పులను క్షమించి మనల్ని సన్మార్గం వైపు నడిపించేదే మాల ధారణ దీక్ష ఉద్దేశం. మాల ధరించిన స్వాములెవరైనా నిష్టాగరిష్టులై నియమాలను ఆచరించాల్సిందే. ప్రాంతమేదైనా...ప్రదేశమేదైనా... అర్చన విధానమేదైనా అంతిమంగా భగవంతుని ధ్యానమే అందరికీ ప్రాతిపదిక. భగవంతుని కృపకు పాత్రులు కావడమే మనందరి కోరిక. అది నెరవేర్చుకోవాలంటే మనముందున్న దేవతార్చన మార్గాల్లో మాలధారణ ఒకటి. నిష్టతో ఉండగలిగితేనే మాల ధరించాలి.

- మట్టిపల్లి యాదగిరి, గురుస్వామి

ఆరోగ్యం..మానసిక ఉల్లాసం

మాలలు ధరించి పాటించే నియమాల ఫలితంగా భక్తులకు శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసమూ కలుగుతాయి. సూర్యోదయానికి ముందే నిద్రలేవడం క్రమశిక్షణ గల జీవితాన్ని అనుకరించేలా చేస్తుంది. బ్రహ్మముహూర్తంలో స్నానమాచరించడం ద్వారా మనసుకు ప్రశాంతత కలిగి మంచి ఆలోచనలను స్ఫురింపజేస్తుంది. మూడుపూటలా స్నానమాచరించడం ద్వారా వ్యక్తిగత శుభ్రతను అలవాటు చేస్తుంది. దేవతార్చన ద్వారా చెడు ఆలోచనలు పోయి భక్తితత్వానికి బాటలు వేస్తుంది. ఏకభుక్తం అనే నియమం మానవుని జీర్ణకోశ వ్యవస్థను మెరుగుపరుస్తుంది. నలుపు రంగు వస్త్రాలు ధరించడం ద్వారా అందరమూ సమానమేనన్న అర్థాన్ని అవగతపరుస్తుంది. మాలలో ఉన్నప్పుడు ఎదుటి వ్యక్తిని స్వామి అని పిలవడం...పిలుపించుకోవడం ద్వారా మన వ్యక్తిత్వాన్ని పెంచుతుంది. పాదరక్షలు లేకుండా నడవడం రుధిర ప్రసారంతో నాడీ వ్యవస్థ మెరుగుపడేలా చేస్తుంది. భజనలు చేయడం పాటలు పాడటం ద్వారా యోగా చేసినంత ప్రయోజనం చేకూరుతుంది. మొత్తం మీద నియమాల మాల స్వాములకు మనసుకు ఆధ్యాత్మిక భావనలను శరీరానికి వ్యాయామాన్ని అందిస్తుంది.

రేపటి పౌరుల కోసం.. మేము సైతం



వారు ఇరువురు వైద్యులు. ప్రజలకు వైద్యసేవలు అందిస్తూనే చిన్నారులకు సేవలందించాలని సంకల్పించారు. ఢిల్లీలో విధులు నిర్వహిస్తూ పిల్లలకు కోసం విశేష సేవలందిస్తున్నారు. చదువుతోనే సమాజంలో మార్పు వస్తుందని ప్రగాఢంగా నమ్మి విద్యార్థులకు తగిన సౌకర్యాలు, విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారు పట్టణానికి చెందిన ఆయుర్వేద వైద్యదంపతులు ఆనంద్, పూర్ణిమ. చిన్నారులంటే అమితంగా ఇష్టపడే వీరు 2015లో బంజారా మహిళా సొసైటీ సంస్థను స్థాపించి సేవా కార్యక్రమాలకు అంకురార్పణ చేశారు.

(మిర్యాలగూడటౌన్ - ఆంధ్రజ్యోతి)

బంజారా మహిళా సొసైటీ సంస్థ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా విద్య, వైద్య సేవలందిస్తున్నారు. ప్రభుత్వ బడులను అభివృద్ధి చేయడంతో పాటు విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, నోట్ బుక్స్, ట్యాబ్లెట్లు, స్కూల్ బ్యాగ్స్, స్పోర్ట్స్ కిట్లు, స్టడీ చైర్లు అందజేశారు. ఇక బాలికా విద్యను ప్రోత్సహించేందుకు గ్రామాలు, తండాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించిన డాక్టర్ ఆనంద్ దంపతులు సర్కారు బడుల్లోని విద్యార్థినులకు శానిటరీ నాప్‌కిన్స్ ఉచితంగా అందజేస్తున్నారు. సంస్థను స్థాపించిన నాటి నుంచి నేటి వరకూ దేశంలోని పలు రాష్ట్రాలలో 500లకు పైగా ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించారు. దివ్యాంగులు, అనాథలకు ఆసరాగా నిలుస్తున్న బంజారా సంస్థ క్యాన్సర్, మెదడువాపు వ్యాధులపై విస్తృతంగా అవగాహన కల్పించింది.

అనతికాలంలోనే ప్రత్యేక గుర్తింపు


డాక్టర్ ఆనంద్ స్థాపించిన బంజారా మహిళా సొసైటీ అనతికాలంలోనే ప్రత్యేక గుర్తింపు పొందింది. వృత్తిరీత్యా ఢిల్లీలో విధులు నిర్వర్తిస్తున్న ఆనంద్ విశ్రాంత ఉద్యోగి అయిన తన తండ్రి ఈసీ గోపాల్, తల్లి సుజాతల సహకారంతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. దేశంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, బీహార్, ఒడిశా, ఢిల్లీ రాష్ట్రాల్లో బంజారా మహిళా సొసైటీ అందిస్తున్న సేవలకు ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈ సంస్థ 2019లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డుకు ఎంపిక కాగా నాటి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు నుంచి ప్రత్యేక ప్రశంసలు అందుకున్నారు. అదే సంవత్సరం ఇండీవుడ్ ఇంటర్నేషనల్ సంస్థ బంజారా మహిళా సంస్థకు ఉత్తమ ఎన్‌జీవో అవార్డు అందజేసింది.

మిత్రుల సహకారంతో...

మిత్రుల సహకారంతో ప్రభుత్వ విద్యాలయాల్లోని చిన్నారులకు నిర్వాహకులు సేవలందిస్తున్నారు డాక్టర్ ఆనంద్. సుమారు ఆరు రాష్ట్రాల్లో నివసిస్తున్న చిన్ననాటి మిత్రుల సహకారంతో విద్య, వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. డాక్టర్ చైతన్య పోలోజు, హరిప్రియ, దివ్య, గీత, లావణ్య, సునీత, పరిమళ, ఝాన్సీ లత, హర్షిత, గోవిందు మిత్రులు అందిస్తున్న సహకారంతోనే సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

నా వంతు సాయమందిస్తున్నా

నేటి బాలలను రేపటి పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత అందరిపై ఉంది. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసించే విద్యార్థులను ప్రోత్సహించాలి. లేదంటే చదువకు దూరమయ్యే ప్రమాదం ఉంది. అక్కడి విద్యార్థులకు అవసరమైనవి అందిస్తే చక్కగా చదువుకుంటారు. ఇక రక్తహీనతతో ఇబ్బంది పడుతున్న బాలికలకు అవగాహన కల్పించడంతో పాటు శానిటరీ నాప్‌కిన్స్‌ను అందజేస్తున్నాం. అల్లోపతి, ఆయుర్వేద, హోమియోపతి విభాగాల్లోని మిత్రుల సహకారంతో విద్యాలయాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నాం.



- డాక్టర్ ఆనంద్, వ్యవస్థాపకులు, బంజారా మహిళా సంస్థ

పోటీల్లో క్రమశిక్షణ పాటించాలి

● డిండి ఎస్సీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శిరీష



గురుకుల పాఠశాలలో క్రీడల్లో పాల్గొన్న విద్యార్థినులు

డిండి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పోటీల్లో క్రీడాకారులు క్రమశిక్షణ పాటించాలని డిండి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శిరీష అన్నారు. మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా బాలికల గురుకుల పాఠశాలల 10వ జోనల్ క్రీడా పోటీల్లో గెలుపొందిన వారి వివరాలను బుధవారం ఆమె ప్రకటించారు. కబడ్డీ అండర్ 14 విభాగంలో మఠంపల్లి మొదటిస్థానం, కట్టంగూరు ద్వితీయస్థానం, కబడ్డీ అండర్ 17 జీవిగూడ మొదటిస్థానం, నకిరేకల్ ద్వితీయస్థానం, కబడ్డీ అండర్ 19 విభాగంలో జాజిరెడ్డిగూడెం మొదటిస్థానం, నకిరేకల్ ద్వితీయస్థానం, వాలీబాల్ అండర్ 19 విభాగంలో డిండి మొదటిస్థానం, జీవీగూడ ద్వితీయస్థానం, క్యారమ్స్ అండర్ 14 విభాగంలో హిమాంపేట మొదటిస్థానం, కట్టంగూరు ద్వితీయస్థానం, క్యారమ్స్ అండర్ 17 విభాగంలో జీవిగూడ మొదటిస్థానం, డిండి ద్వితీయస్థానం, అండర్ 19విభాగంలో డిండి మొదటిస్థానం, హిమాంపేట ద్వితీయస్థానం, ఖోఖో అండర్ 14 విభాగంలో డిండి మొదటిస్థానం, నిడమనూరు ద్వితీయస్థానం, అండర్ 17 విభాగంలో నిడమనూరు మొదటిస్థానం, జాజిరెడ్డిగూడెం ద్వితీయస్థానం, అండర్ 19 విభాగంలో డిండి మొదటిస్థానం, నకిరేకల్ ద్వితీయస్థానం, టెన్నికాయిట్ అండర్ 19 విభాగంలో నకిరేకల్ మొదటిస్థానం, కట్టంగూరు ద్వితీయస్థానం, అండర్ 17 విభాగంలో నిడమనూరు మొదటిస్థానం, కట్టంగూరు ద్వితీయస్థానం, అండర్ 19 విభాగంలో హిమాంపేట మొదటిస్థానం, మఠంపల్లి ద్వితీయస్థానం, చెస్ అండర్ 14 విభాగంలో జాజిరెడ్డిగూడెం మొదటిస్థానం, నకిరేకల్ ద్వితీయస్థానం, చెస్ అండర్ 17 విభాగంలో హిమాంపేట మొదటిస్థానం, మఠంపల్లి ద్వితీయస్థానం, చెస్ అండర్ 19 విభాగంలో జాజిరెడ్డిగూడెం మొదటిస్థానం, డిండి ద్వితీయస్థానం, షాట్‌పుట్ అండర్ 14 బాగంలో హరిప్రియ హిమాంపేట మొదటిస్థానం, పి.హని నకిరేకల్ ద్వితీయస్థానం, డి.అక్షర మఠంపల్లి తృతీయస్థానం సాధించారు. బాల్ బ్యాడ్మింటన్ అండర్ 17 విభాగంలో కట్టంగూరు మొదటిస్థానం, నకిరేకల్ ద్వితీయస్థానం, అండర్ 19 విభాగంలో కట్టంగూరు మొదటిస్థానం, నకిరేకల్ ద్వితీయస్థానంలో విజేతలుగా నిలిచినట్లు ఆమె తెలిపారు. గురువారం మిగిలిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

పలు క్రీడా పోటీల్లో ప్రతిభ చాటిన ఆలేరు విద్యార్థులు

ఆలేరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పలు జిల్లాలో రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో ఆలేరు హైస్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. సంగారెడ్డి జిల్లా అంబేడ్కర్ స్టేడియంలో ఈ నెల 4 నుంచి జరిగిన హాకీ రాష్ట్రస్థాయి అండర్-17 బాలుర విభాగంలో ఆలేరు హైస్కూల్ విద్యార్థులు గడ్డం సందీప్, బీర్రు సాయిగణేష్, నేముల సాయి ప్రతిభ చాటారు. మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన అండర్- 17 బాలికల కబడ్డీ పోటీల్లో దీక్షిత తృతీయ విజేతగా నిలిచింది. అలాగే యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలో మాదాపూర్‌లో జరిగిన కబడ్డీ అండర్-14 విభాగంలో చరణ్‌తేజ, అనే విద్యార్థి ద్వితీయ బహుమతి పొందగా వివిధ పాఠశాలలకు చెందిన ఐదుగురు విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ మేరకు ఆలేరు హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభ చాటిన విద్యార్థులను పాఠశాల హెడ్‌మాస్టర్ మంజుల, ఫిజికల్ డైరెక్టర్ పూల నాగయ్య విద్యార్థులను అభినందించారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



నిత్య కల్యాణ పర్వాలు నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్టామూర్తులను అభిషేకరించి తులసీదళాలతో సహస్రనామార్చనలు జరిపారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవార్లను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అంకార వెండిజోడు సేవలు, సహస్రనార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. శ్రీపర్వతవర్థిని రామలింగేశ్వరస్వామి శివాలయంలో రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 25,17,314 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. హైదరాబాద్ గోషామహల్ ఎమ్మెల్యే రాగూరు రాజాసింగ్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయగా వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ నెల 15వ తేదీన కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని కొండపైన శివాలయం వద్ద సాయంత్రం 5.30 గంటలకు సామూహిక కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, స్థానికులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

బాలలకు బంగారు బాల్యాన్నిద్దాం

(5వ పేజీ తరువాయి)

ఈ హెల్ప్‌లైన్‌ని నిర్వహిస్తోంది. ఈ నెంబర్‌కు ఫోన్ వస్తే తక్షణమే స్పందించి సం బంధిత పిల్లలను రక్షించి హోమ్‌కు చేర్చి, ఆ తర్వాత వారికి అవసరమైన సంరక్షణ, విద్యాభ్యాసం, వైద్యం అందిస్తారు. పిల్లల సంరక్షణకు, హక్కులకు ఎక్కడ భంగం వాటిల్లినా వారిని రక్షించేందుకు, వారిని ఆ ఆపద నుంచి కాపాడేందుకు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సర్వీస్‌ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది.

గ్రామాల్లో విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలు

జిల్లాలో బాలల హక్కుల సంరక్షణ నిమిత్తం సర్పంచుల అధ్యక్షతన 493 గ్రా మాల్లో విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు తరచూ గ్రా మంలో పర్యటించి బాల్యవివాహాలు జరగకుండా నిరోధించడంతో పాటు, బాలకార్మికులుంటే గుర్తించడం, వారిని పనిమాన్పించి స్కూళ్లకు పంపాల్సి ఉంటుంది. పిల్లలకు అవసరమైన ఆహార, విద్యావసతులు అందించేందుకు ఈ కమిటీ కృషి చేస్తుంది. గ్రామాల్లో పిల్లలకు ఇబ్బందులు ఎదురైతే వారి గురించి తెలుసుకొని వారి పరిధిలోబడి సహాయ సహకారాలు అందజేయాలి. స్థాయి మించి యెడల ఉన్నతాధికారులకు సమాచారం అందించాలి.

లైంగికదాడులకు లోనైన పిల్లలకు ఆర్థిక తోడ్పాడు

లైంగికవేధింపులకు లోనైన పిల్లలకు సైతం ప్రభుత్వం ఆర్థికంగా పరిహారమందిస్తోంది. గరిష్ఠంగా రూ. లక్షవరకు సహాయం చేస్తోంది. ఎఫ్ఐఆర్ నమోదైనప్పుడు 23 శాతం, చార్జిషీట్ దాఖలు చేసినప్పుడు మరో 25శాతం ఇస్తూ, కేసు జడ్జిమెంట్ వచ్చినప్పుడు మిగిలిన 50 శాతం పరిహారం బాధితులకు అందజేస్తారు. లైంగికదోపిడీ తీవ్రతను బట్టి పరిహారం ఉంటుంది. జిల్లాలో 2012 నుంచి ఇటీవల వరకు పెండింగ్ ఉన్న 976 కేసులకు సంబంధించి ఇటీవల ప్రభుత్వం సుమారు 2.10 కోట్ల పరిహారమందించగా, జిల్లాలో సంచలనం కలిగించిన ఒకే కేసులో 18 మంది బాధితులకు రూ.18లక్షలను కూడా అందజేశారు.

అనాథ పిల్లల కోసం 'మిషన్ వాత్సల్య'

జిల్లాలో వివిధ కారణాల వల్ల అనాథలుగా మారిన పిల్లలను ఆదుకోవడానికి ప్రభుత్వం 'మిషన్ వాత్సల్య' పథకాన్ని అమలుచేస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలయ్యే ఈ పథకంలో ఎంపికైన పిల్లలకు ఒక్కొక్కరికి నెలకు రూ.4 వేల చొప్పున వారి సంరక్షకులకు అందుతాయి. అనాథ, పాక్షిక అనాథ పిల్లలను చదు వు మాన్పించకుండా, హాస్టళ్లలో ఉంచకుండా వారి ఇంటి వద్ద నుంచే, లేక సంరక్షకుల ఇంటి వద్ద నుంచే స్కూల్‌కి వెళ్లి చదువుకునే అనాథ పిల్లలకు ఈ పథకం వర్తిస్తుంది. పిల్లలకు ఇంటి వాతావరణం కోల్పోకుండా ఇంటి వద్ద నుంచే స్కూల్‌కి వెళ్లి చదువుకునేందుకు, తల్లిదండ్రులు లేకపోయినా వారికి ఆర్థికపరమైన ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు ఈపథకం నిర్దేశించారు. పిల్లలకు 18 సంవత్సరాల వయస్సు వచ్చేంత వరకు పథకం అమలవుతుంది. నల్లగొండ జిల్లాలో ఈ పథకం కింద ఇప్పటివరకు 282 మంది పిల్లలు నమోదయ్యారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండేందుకు 'మిషన్ పరివర్తన'

ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల జోలికి వెళ్లకుండా పిల్లల్లో ప్రధానంగా టీనేజీ పిల్లల్లో అవగాహన కల్పించేందుకు పోలీస్‌శాఖ, బాలల హక్కుల పరిరక్షణ సమితితో కలిసి జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ పరివర్తన కార్యక్రమం అమలుచేస్తున్నారు. ఈ కార్యక్రమం కింద పోలీస్, షీ టీమ్‌లు, అధికారులతో కలిసి కాలేజీలు, హైస్కూళ్లలో సదస్సులు, సమావేశాలు నిర్వహించి దురలవాట్లకు దూరంగా ఉండేలా అవగాహన కల్పిస్తున్నారు.

అంగన్‌వాడీ ద్వారా పోషకాహార పంపిణీ

తల్లి కడుపులో ఉన్నప్పటి నుంచే పిల్లలకు పోషకాహారాన్ని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా పిల్లలకు పోషకాహార పంపిణీని చేపట్టింది. గర్భిణీగా ఉన్నప్పటి నుంచి తల్లికి ప్రసవం అయ్యేంత వరకు ప్రతీ రోజూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒక పూట సంపూర్ణ ఆహారాన్ని అందిస్తున్నారు. గుడ్డు, 200 మిల్లీలీటర్ల పాలు, పప్పు, ఒక కూరతో కలిపి ఈ భోజనం అందిస్తారు. దీని ద్వారా తల్లితో పాటు గర్భస్థ శిశువుకు పోషకాహారం అందుతుంది. పుట్టిన పిల్లలకు గంటలోనే ముర్రుపాలు తాగిస్తారు. ఆ తర్వాత పుట్టిన పిల్లలకు టీటీ మొదలుకొని రెండేళ్ల వయస్సు వచ్చేంత వరకు సంబంధిత టీకాలను అందిస్తారు. అంతేకాకుండా ఆరునెలల పాటు పిల్లలకు తల్లిపాలను అందిస్తారు. ఆ తర్వాత అన్నప్రాసన నిర్వహించి పిల్లలకు తల్లిపాలతో పాటు అనుబంధ పోషకాహారాన్ని కూడా అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్నారు. భావి భారతపౌరులైన పిల్లలు ఆరోగ్యకరంగా పెరిగేలా చూడడమే ఏకైక లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో ఆడుకుంటున్న చిన్నారులు

బాలకార్మికులను గుర్తించేందుకు ప్రత్యేక తనిఖీలు

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతీ సంవత్సరం జనవరి, జూన్‌లో ఆపరేషన్ ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ పేరుతో ప్రత్యేక తనిఖీలను నిర్వహిస్తున్నారు. పోలీసులు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, బాలల సంక్షేమ సమితి ఆ ధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహిస్తోంది. ఈ కమిటీలు ఆ నెలల్లో తమకున్న సమాచారంతో పాటు, విస్తృతంగా జిల్లాలో పర్యటించి పనిచేసే పిల్లలను గుర్తిస్తారు. వారిని తీసుకువచ్చి పాఠశాలలు, బ్రిడ్జి స్కూళ్లు, ఇతర రెసిడెన్షియల్స్‌కు పంపిస్తున్నారు. జిల్లా లో 2015 నుంచి ఇప్పటివరకు 2722 మంది చిన్నారులను బాలకార్మిక దుస్థితి నుంచి కాపాడారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



నేటి బాలలే రేపటి పౌరులు. ప్రతీ బాలబాలిక ఉత్తమ పౌరులుగా ఎదగడం వారి హక్కు. జీవించడానికి, నివసించడానికి, చదువుకోవడానికి, రక్షణ పొందడానికి వారికి హక్కులు ఉన్నాయి. వారి హక్కులను భంగం కలిగిస్తే చట్టపరంగా చర్యలుంటాయి. పిల్లలను దేశసంపదగా అందరం గుర్తించాలి. అనివార్య పరిస్థితుల్లో అనాథలయ్యే పిల్లలను సైతం ప్రభుత్వం ఆదరించి అన్ని వసతులు, సదుపాయాలు వారికి కల్పిస్తుంది. ఆరోగ్యవంతమైన పిల్లల కోసం అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తోంది. జిల్లాలో మా శాఖ ద్వారా బాలల కోసం ఉద్దేశించిన అన్ని పథకాలు, కార్యక్రమాలను సద్వినియోగం చేసేలా చూస్తున్నాం.

● కృష్ణవేణి, జిల్లా మహిళ, శిశు, సంక్షేమశాఖ అధికారి

బాలల సంక్షేమమే ధ్యేయంగా అందరం కృషి చేయాలి



బాలల సంక్షేమమే ధ్యేయంగా అందరిలో చైతన్యం రావాల్సి ఉంది. గతంతో పోల్చుకుంటే చాలా వరకు బాల్య వివాహాలు, బాలకార్మికులు తగ్గిపోయారు. ఈ దురాచారాలు పూర్తిగా లేకుండా పోవాలి. ప్రభుత్వం బాలల హక్కులు, సంరక్షణ, వృద్ధి కోసం అమలు చేసే పథకాలను వారి దరి చేర్చేందుకు అందరం అంకితభావంతో పనిచేస్తున్నాం. బాలల దినోత్సవ సందర్భంగా బాలల హక్కుల పరిరక్షణకు మరోసారి ప్రతినబూనుతాం.

● చింత కృష్ణయ్య, చైర్మన్, జిల్లా బాలల సంక్షేమ కమిటీ

జిల్లాలో ప్రభుత్వం సంరక్షించిన బాధిత బాలల వివరాలు

కాపాడిన పిల్లల వర్గం	2011 ఇప్పటివరకు
వదిలేయబడిన పిల్లలు	21
బాలకార్మికులు	224
బాల్య వివాహ బాధితులు	450
పిల్లల విక్రయం	76
అక్రమ దత్తత	19
తప్పిపోయిన పిల్లలు	106
నిర్లక్ష్యం చేయబడిన పిల్లలు	81
అనాథ పిల్లలు	139
పేద పిల్లలు	58
పారిపోయిన పిల్లలు	72
లైంగికదాడులు, వేధింపులకులోనైన వారు	120
ప్రత్యేక అవసరాలు గల పిల్లలు	28
పిల్లలను ప్రభుత్వానికి అప్పగించినవారు	31
పాక్షిక అనాథలు	113
ఇతర మార్గాల్లో రక్షించబడిన పిల్లలు	45
మొత్తం	1597

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.132	210	240
సూర్యాపేట	రూ.125	190	220
నల్లగొండ	రూ.150	220	250

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	586.60
టీఎంసీలు	303.4310
ఎడమకాల్వకు నీటి విడుదల	5582
కుడికాల్వకు	6324
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	24.00 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	400 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	14,706 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	28,252 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	42.27 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	0
అవుట్‌ఫ్లో	2 వేల క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.10 అడుగులు
టీఎంసీలు	4.22
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత
ఇన్‌ఫ్లో	652.65 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	44.88 క్యూసెక్కులు

విద్యార్థులకు లేఖ రాసిన చాచా నెహ్రూ

● సాగర్‌తో నెహ్రూకు ఎనలేని అనుబంధం



నాగార్జునసాగర్ వచ్చిన నెహ్రూ (ఇన్‌సెట్‌లో) ఆయన విద్యార్థులకు రాసిన లేఖ

నాగార్జునసాగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): భారతదేశ మొదటి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూకు సాగర్‌తో ఎనలేని అనుబంధం ఉంది. 1955 డిసెంబరు 10వ తేదీన నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి నెహ్రూ మొదటిసారి సాగర్‌కు వచ్చారు. ప్రాజెక్టు శంకుస్థాపన అనంతరం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో తవ్వకాల్లో బయల్పడిన బౌద్ధ తమ స్తూపాలను, నమూనాలను జలాశయం మధ్యలో నాగార్జునకొండపై ఏర్పాటు చేసిన మ్యూజియం ప్రారంభోత్సవానికి 1966లో రెండవ సారి నెహ్రూ సాగర్‌కు వచ్చారు. రెండోసారి సాగర్‌కు వచ్చిన నెహ్రూను హిల్‌కాలనీలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన నాటి విద్యార్థులు 1967 నవంబరు 14వ తేదీ నెహ్రూ జయంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ లేఖలు రాశారు. లేఖలను అందుకున్న నెహ్రూ తిరిగి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు లేఖ రాశారు. లేఖ సారాంశం ఏమిటంటే మీరు రాసిన లేఖ నాకు అందినది. దీనికి నేను ఎంతో సంతోషిస్తున్నాను. అని లేఖలో పేర్కొన్నారు. ఇలా నెహ్రూ 1955 నుంచి 1966 వరకు రెండు పర్యాయాలు సాగర్‌కు వచ్చారు. ప్రాజెక్టు నిర్మాణంలో పాలు పంచుకున్న ఇంజనీర్లను కూడా నెహ్రూ కలిసి ఇంజనీర్ల పనితనానికి అభినందించారు.

కుటుంబ కలహాలతో మహిళ బలవన్మరణం

మద్దిరాల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం చిననెమిల గ్రామంలో జరిగింది. ఎస్ఐ వీరన్న తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా బండ్లపల్లి మండలం కైకనగూడెం గ్రామానికి చెందిన దండిగల జగ్గయ్య-మంగమ్మ దంపతుల కుమార్తె గణిత(30)కు 17ఏళ్ల క్రితం మద్దిరాల మండలంలోని చిననెమిల గ్రామానికి చెందిన దబ్బేటి మహేష్‌తో వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ దంపతులు చిననెమిల గ్రామంలో ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో 10రోజులుగా ఘర్షణ పడుతున్నారు. మనస్తాపానికి గురైన గణిత గ్రామ శివారులో పత్తి చేనుకి మంగళవారం సాయంత్రం వెళ్లి పురుగు మందు తాగింది. గమనించిన భర్త, ఆమెను ప్రైవేట్ వాహనంలో సూర్యాపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలి తండ్రి జగ్గయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బొటన వేలి గోటిపై నెహ్రూ



కనగల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కనగల్ మండలం బుడుమర్ల గ్రామానికి చెందిన గోటి చిత్రకారుడు, కనగల్ హైస్కూల్ డ్రాయింగ్ టీచర్ కారింగు జానయ్యగౌడ్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బుధవారం కుడిచేతి బొటన వేలి గోటిపై నెహ్రూ చిత్రపటాన్ని గీసి ప్రతిభను చాటుకున్నాడు. అతను గీస్తున్న గోటి

● గోటి చిత్రకారుడు జానయ్యగౌడ్ ప్రతిభ

చిత్రాల పెయింటింగ్‌లకు అనేక అవార్డులను అందుకున్నాడు. తెలుగు బుక్ ఆఫ్ నేషనల్ రికా ర్డు, తెలంగాణ బుక్ ఆఫ్ స్టేట్ రికార్డులో చో టు సంపాదించుకున్నాడు. ప్రస్తుతం అతని గోటి సైజ్ రెండు సెంటీమీట ర్ల వెడల్పు, 11 సెంటీమీటర్ల పొ డవు ఉందని జానయ్యగౌడ్ తెలిపాడు.



గోటిపై వేసిన నెహ్రూ చిత్రం

వెంబడించారు..రూ.14.50లక్షలు కొట్టేశారు

● సినీ ఫక్కీలో నగదు చోరీ

హుజూర్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):సినీ ఫక్కీలో సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో చోరీ జరిగింది. బాధితుడు పొలిశెట్టి వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్‌లోని మిర్యాలగూడ రోడ్డులో ఉన్న శ్రీయాదగిరి లక్ష్మీనర్సింహ రైస్‌మిల్లులోవెంకటేశ్వర్లు గుమస్తాగా పనిచేస్తున్నాడు. మిల్లులో ధాన్యం విక్రయించిన రైతులకు డబ్బులు ఇచ్చేందుకు బుధవారం మధ్యాహ్నం పట్టణంలోని ఎస్‌బీఐలో రూ.14.50 లక్షలు డ్రా చేసుకుని మోటార్ సైకిల్ ట్యాంకర్ బ్యాగ్‌లో పెట్టుకుని వస్తున్నాడు. గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ఇందిర సెంటరు సమీపంలో వెనుక నుంచి వచ్చి మోటార్ సైకిల్ ట్యాంకర్‌పై ఉన్న నగదు బ్యాగును లాక్కొని పరారయ్యారు. వెంకటేశ్వర్లు వారి వెంట పడగా చిక్కలేదు. దీంతో పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో రైస్‌మిల్లు యజమానులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సినీ ఫక్కీలో జరిగిన ఈ చోరీ పట్టణంలో చర్చనీయాంశమైంది.బ్యాంక్‌లో రైస్‌మిల్లు గుమస్తా డబ్బు డ్రా చేస్తుండగా గమనించిన వ్యక్తులే చోరీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పట్టణంలో సీసీ కెమెరాలు ఉన్నా పనిచేయడం లేదు. సీసీల కెమెరాల ఏర్పాటుకు పట్టణంలోని మిల్లర్లు, ఇతరులు గతంలో లక్షల రూపాయలు విరాళంగా ఇచ్చారు. సీసీ కెమెరాలను వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

జల్సాలకు అలవాటు పడి చోరీలు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గిరిబాబు

పెద్దఅడిశర్లపల్లి,నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి నిందితులను గుడిపల్లి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. దేవరకొండ డీఎస్పీ గిరిబాబు గుడిపల్లి పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగడిపేట గ్రామానికి చెందిన తంగిరాల గంగాధరచారి(30) ఎలక్ట్రానిక్, వడ్రంగి పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. అతడి స్నేహితుడు త్రిపురారం మండలం, సత్యనారాయణపురం గ్రామానికి చెందిన మోట మారి ఆంజనేయులు(25)తో సులభంగా డబ్బులు సంపాదించాలని దొంగతనాలకు పాల్పడుతున్నారు. గతేడాది పీఏపల్లిలో వంగాల లక్ష్మారెడ్డి ఇంట్లో చోరీ చేసి 4 తులాల ఆభరణాలు, నగదును ఎత్తుకెళ్లడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే ఈ నెల 6న అంగడిపేట ఎక్స్‌రోడ్డులో రాజు ఇంట్లో రూ.92 వేలు చోరీకి గురి కావడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. వరుస దొంగతనాలు జరుగుతు ఉండడంతో సీరియస్‌గా తీసుకున్న కొండమల్లేపల్లి సీఐ ధనంజయ్, గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు సీసీ ఫుటేజీలు వేలిముద్రల ఆధారంగా పాత నేరస్థుడైన అంగడిపేట ఎక్స్‌రోడ్డు చెందిన గంగాధరచారి అని గుర్తించారు. అతడిని అదుపులో తీసుకొని విచారించగా ఆంజనేయులుతో కలిసి చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుల నుంచి ఎర్టీగా కారు, ఆభరణాలు, కూలర్ మోటర్లు, సెల్‌ఫోన్లు మొత్తం కలిపి రూ. 6 లక్షల విలువైన వస్తువులను రికవరీ చేశామని డీఎస్పీ తెలిపారు. కేసును తొందరగా ఛేదించినందకు సీఐ ధనుంజయ్, ఎస్ఐ నర్సింహులు, క్రైం టీం శ్రీధర్‌రెడ్డి, హేమానాయక్, హట్టీనాయక్, భాస్కర్, గురువారెడ్డి, రవికుమార్‌ను ఎస్పీ రివార్డు ప్రకటించినట్లు డీఎస్పీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అభిలాష్‌కుమార్(ఫైల్)

చౌటుప్పల్ రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం శివారు జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందాడు. మరో యువకుడు గాయపడ్డాడు. సీఐ మన్మధకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తాటిఅన్నారం గ్రామానికి చెందిన బర్రె అభిలాష్‌కుమార్ (24), షేక్ రోమన్(24) ద్విచక్రవాహనంపై వారి సొంత పనుల కోసం చౌటుప్పల్‌కు వస్తుండగా గుర్తుతెలియని వాహనాన్ని ఓవర్‌టేక్ చేశారు. బైక్ హ్యాండిల్ గుర్తు తెలియని వాహనాన్ని తాకడంతో అదుపు తప్పి డివైడర్‌పై పడిపోయారు. తీవ్ర గాయాలైన అభిలాష్ అక్కడికక్కడే మృతి చెందాడు. రోమన్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. అభిలాష్ మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, పోస్టుమార్టం నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కారు ఢీకొని వృద్ధుడు..

తిప్పర్తి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలోని మల్లెపల్లివారి గూడెం గ్రామం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన జూకూరి కొండయ్య(65) ఉదయం 6 గంటలకు అద్దంకి-నార్కట్‌పల్లి హైవేపై రోడ్డు పక్కన నడుస్తూ వెళ్తున్నాడు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి మిర్యాలగూడ వైపునకు వెళ్తున్న కారు అతివేగంగా కొండయ్యపైకి దూసుకెళ్లి బలంగా ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ స భ్యులు వెంటనే నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుడి పెద్ద కుమారుడు గురువయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సింగం రాంమూర్తి తెలిపారు.


కోటి దీపోత్సవంలో పుండరీక భక్తసేవా సమాజం



కోటి దీపోత్సవంలో పాల్గొన్న పుండరీక భక్త సేవాసమాజం సభ్యులు

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని బుధవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన కోటి దీపోత్సవం కార్యక్రమంలో యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లికి చెందిన పుండరీక భక్త సేవా సమాజం సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అలంపూర్ జోగులాంబదేవి, బాలబ్రహ్మేశ్వరస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భక్తసేవా సమాజం అధ్యక్షులు చిట్టిమల్ల లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు బిట్ల చంద్రశేఖర్, ఎల్లమ్మ ఉన్నారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి



సదస్సులో పాల్గొన్న ఏఐసీటీ ప్రతినిధులు

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు నూతన ఆవిష్కరణపై దృష్టిసారించాలని సెయింట్ మేరీ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ కేవీకే.రావు కోరారు. మండల పరిధిలోని దేశ్‌ముఖి గ్రామ శివారులోని సెయింట్ మేరీస్ ఇంజనీరింగ్ కాలేజీలో బుధవారం ఏఐసీటీ ఆధ్వర్యంలో 'రోల్ ఆఫ్ సెమీకండక్టర్స్ ఇన్ మోడ్రన్ ఎలక్ట్రానిక్స్' అనే అంశంపై రెండో రోజు సదస్సు నిర్వహించారు. సదస్సుకు హైదరాబాద్‌లోని వివిధ కాలేజీల విద్యార్థులు, అధ్యాపకులు హాజరయ్యారు. సదస్సులో సెక్రటరీ జోసఫ్ శ్రీహర్ష, ప్రిన్సిపాల్ డాక్టర్ టీఎస్.శ్రీనివాస్, డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి, డాక్టర్ సాంబశివరావు, అప్పారావు, సతీష్ పాల్గొన్నారు.

ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి మృతదేహం లభ్యం



రాజశేఖర్(ఫైల్)

తిరుమలగిరి(సాగర్), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు, జీవితంపై విరక్తితో అక్టోబరు 28న ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి మృతదేహం బుధవారం లభ్యమైంది. స్థానిక ఎస్ఐ కె.వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. అడవిదే వులపల్లి మండలంలోని కొత్తనందికొండకు చెందిన కొర్ర రాజశేఖర్(24) హైదరా బాద్‌లోని ఆటోను నడుపు కుంటూ మీర్‌పేటలో నివాసం ఉండేవాడు. అయితే రాజశేఖర్ అక్టోబరు 27న కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఒంటరిగా హైదరాబాద్ నుంచి నాగార్జునసాగర్‌కు వచ్చాడు. అక్టోబరు 28న సాగర్ సమీపం లోని నాగార్జునపేటతండా గ్రామ శివారులోని అటవీ ప్రాంతానికి వెళ్లి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు భార్య మమతకు ఫోన్‌లో చెప్పి అనంతరం స్విచ్ఛాఫ్ చేశాడు. అనంతరం పురుగుల మందు తాగాడు. దీంతో భార్య స్థానిక బంధువుల ద్వారా మీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విషయాన్ని బంధువులకు కూడా తెలుపడంతో వారు వెతుకు తున్నారు. ఈ క్రమంలో బుధవారం నాగార్జున పేటలో చెట్ల పొదల్లో కుళ్లిపోయిన మృతదేహాన్ని ఓ గొర్రెల కాపరి చూసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతదేహం పక్కన మృతుడి ఫోన్ లభ్యమైంది. ఫోన్‌లో లభ్యమైన నంబర్ల ఆధారంగా మృతి చెందిన వ్యక్తి రాజశేఖర్‌గా గుర్తించారు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండడంతో వైద్యులు పంచనామా నిర్వహించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడి అన్న కొర్ర సురేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

గోవులను తరలిస్తున్న డీసీఎం, లారీలు పట్టివేత

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): డీసీఎం, లారీల్లో హైదరాబాద్‌కు అక్రమంగా తలిస్తున్న గోవులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం అద్దంకి- నార్కట్‌పల్లి ప్రధాన రహ దారిపై వాహనాలే తనిఖీ చేస్తుండగా మిర్యాలగూడ వన్‌టౌన్ పరిధిలో-2, రూరల్ పోలీస్ స్టేషన్‌పరిధిలో-1, మాడ్గులపల్లి పోలీస్ స్టేషన్‌పరిధిలో-2 ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం నుంచి డీసీఎం, లారీల్లో హైదరాబాద్‌కు వెళ్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడ్డ ఐదువాహనాల్లో సుమారు 269 వరకు గోవులున్నట్లు గుర్తించా మన్నారు. డీసీఎం, లారీల్లో సామర్థ్యాన్ని మించి గోవులను ఎక్కించడంతో ఊపిరాడక 6 గోవులు మృతి చెందాయి. మిగతా గోవుల సంరక్షణార్థం అందుబాటులో ఉన్న గోశాలకు తరలిస్తు న్నట్లు తెలిపారు. ఐదుగురు డ్రైవర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తు మన్నారు. పట్టుబడ్డ గోవులను ఎవరు కొనుగోలు చేసి, ఎందు కోసం తరలిస్తున్నారనే దానిపై లోతైన విచారణ జరుపుతున్నట్లు డీఎస్పీ తెలిపారు.

● చౌటుప్పల్ రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 70గోవులను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. సీఐ మన్మధకుమార్ తెలిపి న వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి డీసీఎంలో 70గోవులను విజయవాడ నుంచి హైదరాబాద్ బహదూర్ కబేళాకు తరలిస్తుండగా పోలీసులు చౌటుప్పల్ బస్ స్టేషన్ సమీపంలో పట్టుకున్నారు. పట్టుబడ్డ ఆవులను జియాగూడ గోశాలకు తరలించారు. కర్ణాటకకు చెందిన ఎండీ ఖాజా, హరిహర అర్జున్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రెండు ఆర్టీసీ బస్సులు ఢీ. ముగ్గురికి గాయాలు..

కేతేపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఏపీలోని ఉయ్యూరు డిపోకు చెందిన ఆర్టీసీ లగ్జరీ బస్సు హైదరాబాద్‌కు వెళ్తు న్నది. ఈ క్రమంలో కేతేపల్లికి చేరుకోగానే హ్యాండ్ బ్రేక్ పట్టుకోవడంతో డ్రైవర్ బస్సును రోడ్డు పక్కకు నిలిపాడు. అనంతరం బస్సులోని ప్రయాణికులను మరో బస్సులోకి ఎక్కిస్తున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ వెళ్తున్న ఏపీలోని ఏలూరు డిపోకు చెందిన లగ్జరీ బస్సు ఉయ్యూరు డిపో బస్సును వెనుక నుంచి ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో ఉయ్యూరు డిపో బస్సు డ్రైవర్‌కు రెండు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. ఏలూరు డిపో బస్సులోని ఇరువురు ప్రయాణికులు గాయపడ్డారు. అంబులెన్స్ సాయంతో క్షతగాత్రులను చికిత్స కోసం సూర్యాపేట జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ధర్మవనంలో కుళ్లిన మృతదేహం

భువనగిరి టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పట్టణ శివారులోని ధర్మవనం ప్రాజెక్టులో బుధవారం కుళ్లిన మృతదేహం ఎముకల గూడు రూపకంలో లభ్యమైందని పట్టణ ఇన్స్‌పెక్టర్ కె.సురేష్‌కుమార్ తెలిపారు. ఇన్స్‌పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మవనం ప్రహరీ, ఫెన్సింగ్ మధ్యన పెరిగిన గడ్డిని ధర్మవనం సిబ్బంది శుభ్రం చేస్తున్న క్రమంలో ఎముకల గూడు వెలుగు చూసింది. దీంతో ధర్మవనం వాచ్‌మెన్ డి.వేణుగోపాల్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహంపై ఎర్రటి కట్ డ్రాయర్, ఓ చేతికి రబ్బర్ బ్యాండ్ ఉన్నాయి. మృతదేహం సుమారు 30 సంవత్సరాల లోపు యువకుడిదిగా, సుమారు రెండు నెలల క్రితం మృతి చెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నట్లు తెలిసింది. భువనగిరి పరిసరాల్లో ఇటీవల ఎవరైనా తప్పిపోయినా, ఆచూకీ లేని వివరాలను పట్టణ పోలీస్ స్టేషన్‌లో తెలుపాలని సూచించారు. 8712662471, 8712579985కి సంప్రదించాలని అన్నారు.

గడ్డి ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ

కేతేపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గడ్డిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా సమీపంలో బుధ వారం జరిగింది. సూర్యాపేట వైపు నుంచి హైదరాబాద్ వైపునకు గడ్డిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్ టోల్‌ప్లాజా సమీపంలో వెనుక నుంచి అదే వైపునకు వెళ్తున్న లారీ ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో టాక్టర్ ఇంజన్, ట్రాలీ వేరు పడి ట్రాలీ రోడ్డుపై పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరుగలేదు.

తూనికల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

రాజాపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు తూనికల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తూనికలు కొలతల జిల్లా అధికారి కందగడ్ల వెంకటేశ్వర్లు హెచ్చరించారు. బుధవారం రాజాపేట మండల కేంద్రంలోని గ్యాస్ ఏజెన్సీ, పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. తూనికల యంత్రాలను పరిశీలించారు. గ్యాస్ ఏజెన్సీలో తనిఖీ చేసి ఆటో ట్రాలి వెంట వేయింగ్ మిషన్ లేకపోవడంతో కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన తూనికలను మాత్రమే వినియోగించాలని కోరారు.

సమాచారం

నేడు ఎమ్మెల్యే రాక

అడ్డగూడూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అడ్డగూడూరు మండలంలోని మానాయికుంట- గురుజాల మూసీ నదిపై చెక్‌డ్యాంమ్ నిర్మాణ స్థల పరిశీలనకు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, సంబంధిత నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి గురువారం పాల్గొనున్నారు. ఈమేరకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోలెబోయిన లింగయ్య యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం..

మోటకొండూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మోటకొండూరు మండల కేంద్రంలో సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ నిర్వహణ పనులు ఉన్నందున సరఫరాలో అంతరాయం ఏర్పడవచ్చని ఏఈ వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు కంటి వైద్యశిబిరం

మోత్కూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం మోత్కూరు యూనిట్ ఆధ్వర్యంలో ఈ నెల 15న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మోత్కూరులోని తమ కార్యాలయంలో మెడివిజన్ ఐ కేర్ ఆస్పత్రి వారితో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్న ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బద్దం యాదిరెడ్డి, ఆకవరం వల్లభాయి బుధవారం విలేకరులకు తెలిపారు.

స్వచ్ఛంద సంస్థలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

భువనగిరి (కలెక్టరేట్), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమానికి నిర్వహిస్తున్నపాఠశాలలు, ఆశ్రమాలు, పలు సంస్థలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా సంక్షేమశాఖాధికారి నర్సింగరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగుల సంక్షేమ చట్టం 2016 అనుసరించి రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత మాత్రమే వాటిని నడపాలని అన్నారు. జిల్లాలో నడుస్తున్న అన్ని దివ్యాంగుల సంస్థలు ఈనెల 30వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా ఈశ్వర్

రామన్నపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ టి.ఈశ్వర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆస్పత్రి సూపరిండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ బి వీరన్న ఆరోగ్య కారణాల రీత్యా సివిల్ సర్జన్ డాక్టర్ ఈశ్వర్‌కు పూర్తి బాధ్యతలు అప్పగించారు. ఈసందర్భంగా డాక్టర్ ఈశ్వర్ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తానని తెలిపారు.


సబ్‌స్టేషన్‌తో చదువులకు ఆటంకం

- భయాందోళనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు
- ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని స్థానికుల డిమాండ్



యాదగిరిగుట్టలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(సక్సెస్)

పాఠశాల అంటేనే ఓ భరోసా..విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించే ఆలయం..తమ పిల్లలు పాఠశాలలో భద్రతగా ఉంటారని విద్యార్థుల తల్లిదండ్రుల విశ్వాసం.. అలాంటి పాఠశాల ప్రహరీలోపల పాఠశాల భవనం వెనుకభాగంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఉండడం.. అందులోనుంచి తరచూ శబ్దాలు వస్తుండడంతో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భయాందోళనకు గురవతున్నారు. ఇది ఎక్కడో కాదు.. యాదగిరిగుట్ట పట్టణంలోనే..



తరగతి గదులకు సమీపంలోనే 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా ఐదు ఎకరాల విస్తీర్ణంలో అందరికీ అందుబాటులో ఉన్న ఉన్న బాలుర, బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల స్థలం ఉండేది. 15సంవత్సరాల క్రితం ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధుల అనాలోచితమైన నిర్ణయాలతో స్థలాన్ని దేవస్థానానికి అప్పగించారు. పాఠశాలలను నియమ నిబంధనలను గాలికి వదిలి.. విద్యార్థులకు అసౌకర్యాల నడుమ పాఠశాలలను నిర్మించారు. పాఠశాలల ప్రహరీ లోపలే విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఎప్పుడు ఏ ఏప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. విద్యుత్ సరఫరా అయ్యే క్రమంలో ధ్వని కాలుష్యం, రేడియేషన్‌తో ప్రమాదం పొంచి ఉందని విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇటీవల పాఠశాల ప్రహరి లోపల మరుగుదొడ్ల నిర్మాణానికి ఎక్స్‌కవేటర్‌తో గుంతలు తీస్తున్న సమయంలో విద్యుత్ సబ్‌స్టేషన్ సరఫరా కోసం భూమిలో ఉన్న వైర్లు ఎక్స్‌కవేటర్ పనులు చేస్తుండగా వైర్లు తేలగా డ్రైవర్ అప్రమత్తంగా ఉండకుంటే పెద్దప్రమాదం జరిగిఉండేది. అయినప్పటి విద్యుత్ అధికారులు మాత్రం తమ వైర్లను ధ్వంసం చేశారని దానికి రూ. లక్ష పరిహారం ఇవ్వాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిపై ఒత్తిడి తీసుకురావడంతో ఆమె ప్రజా ప్రతినిధులను ఆశ్రయించడంతో డబ్బులు కట్టకుండా నిలిపివేశారు.

దుర్వాసన వెదజల్లుతున్నా చర్యలేవీ?

లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి పాఠశాలకు కూతపెట్టు దూరంలోనే మొక్కులు తీర్చుకవడానికి మేకలు, గొర్రెలను బలి ఇస్తుంటారు. వాటి ద్వారా వచ్చే వ్యర్థాలను సమీపంలోనే పడేస్తుంటారు. అవికుళ్లిపోయి దుర్వాసన వస్తుండడం విద్యార్థులకు సమస్యగా మారింది. తరగతి గదుల్లో కూర్చోవడానికి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు గొర్రెలు, మేకల వ్యర్థాలను పాఠశాలలకు దూరంగా వేయాలని విద్యార్థులు కోరుతున్నారు. మరోవైపు ఆలయం నుంచి మైకుల ద్వారా వచ్చే ధ్వని సైతం విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. సమీపంలోనే శ్మశాన వాటిక ఉండడం.. ఎవరైనా మృతి చెందితే వచ్చే వాయిద్యాల శబ్దాలు ఇబ్బందికరంగా మారాయి. ఇప్పటికైనా సమస్యల వలయంలో ఉన్న రెండు పాఠశాలల విషయంలో ప్రత్యామ్నాయ మార్గం ఆలోచించి ప్రశాంత వాతావరణం పాఠశాలలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

తరగతి గదిలో కూర్చోవాలంటే భయంగా ఉంది



విద్యుత్ సబ్‌స్టేషన్ పాఠశాల ప్రహరి లోపల ఉండటంతో తరగతి గదిలో కూర్చోవాలంటే భయం భయంగా ఉంది. విద్యుత్ సరఫరా అయ్యే సమసయంలో అప్పుడప్పుడూ వచ్చే శబ్దాలతో భయపడుతున్నాం. చదువుపై దృష్టి సారించలేకపోతున్నాం.

-రాజు, పాఠశాల విద్యార్థి, యాదగిరిగుట్ట

పాఠశాలలను పాత స్థలంలోకే మార్చాలి



గత ప్రభుత్వం బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను గోశాలకు తరలించి పెద్ద తప్పుచేశారు. అసౌకర్యంగా ఉన్న పాఠశాలలను పాత స్థలంలోనే పునర్నిర్మించాలి. గోశాల పాఠశాలలు విద్యుత్ సబ్‌స్టేషన్, భక్తులు మొక్కుల చెల్లించుకున్న జీవాల మాసం వ్యర్థాలు, శ్మశానవాటిక, ఆలయం ధ్వుణులు, దారి లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుత పాఠశాలలను తక్షణమే పాత స్థలంలోకి మార్చాలి.

-కల్లేపల్లి మహేందర్, యాదగిరిగుట్ట మండలం

వైర్లు తేలినమాట వాస్తవమే



ఇటీవల విద్యార్థుల కోసం మరుగుదొడ్లు నిర్మాణం చేయడానికి పాఠశాల ప్రహరీలోల ఎక్స్‌కవేటర్ ద్వార గుంతలు తీస్తుండగా సబ్‌స్టేషన్ వైర్లు తేలాయి. డ్రైవర్ అప్రమత్తత కారణంగా పెద్ద ప్రమాదం తప్పింది. వైర్లు తేలినందుకు సబంధిత అధికారులు తమను డబ్బులు చెల్లించాలని ఒత్తిడి తెచ్చిరు. ప్రజా ప్రతినిధుల సహకారంతో సమస్య సద్దుమనిగింది.

-శరత్‌యామిని, ఎంఈవో, యాదగిరిగుట్ట మండలం

టవర్స్ పూర్తయితే భువనగిరికి కొత్తరూపు

- సాయికృష్ణ, ట్రాన్స్‌కో, భువనగిరి టౌన్ ఏఈ

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



ఆంధ్రజ్యోతి: టవర్స్ పనులతో పట్టణానికి ఎలాంటి ప్రయోజనం ఉంటుంది..?

ఏఈ: టవర్స్‌కు విద్యుత్‌తీగల పనులు పూర్తయ్యాక వినియోగంలోకి వస్తాయి. దీంతో ఇప్పటి వరకు ఉన్న స్తంభాలను తొలగిస్తాం. కిందికి వేలాడే విద్యుత్ తీగల సమస్యలు తీరుతాయి. రహదారికి ఇరువైపులా ఉన్న టవర్స్‌కు మునిసిపాలిటీ లైట్లను బిగిస్తుంది. దీంతో పట్టణానికి కొత్త శోభ వస్తుంది.

ఆంధ్రజ్యోతి: ఏయే బస్తీల్లో ఇబ్బందులు తొలగనున్నాయి.

ఏఈ: టవర్స్ ఏర్పాటుతో విద్యానగర్, తారకరామానగర్, పహాడీనగర్, హెచ్‌బీ కాలనీల్లో 33కేవీ విద్యుత్ వైర్ల బాధలు తప్పనున్నాయి.

ఆంధ్రజ్యోతి: పనుల అంచనా వ్యయం?

ఏఈ: సుమారు రూ.8కోట్ల వ్యయంతో పనులను చేపట్టాం.

ఆంధ్రజ్యోతి: ఎన్ని టవర్స్, ఎంత కండక్టర్ బిగిస్తున్నారు..?

ఏఈ: 180 టవర్స్‌ను గతంలోనే ఏర్పాటు చేశాం. తాజాగా సుమారు 3.5 కిలోమీటర్ల 33, హెచ్‌టీ, ఎల్‌టీ కండక్టర్‌ను బిగిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పనుల పూర్తికి ఇంకా ఎంత సమయం పడుతుంది...?

ఏఈ: సుమారు రెండు నెలలు పట్టొచ్చు. పనులు జరిగే ప్రాంతంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నాం. వినియోగదారులు సహకరించాలని కోరుతున్నాము.

-భువనగిరి టౌన్

పిల్లలందరికీ వ్యాక్సిన్ అందించాలి

మోటకొండూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పిల్లలందరికీ సక్రమంగా వ్యాక్సినేషన్ అందించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రామకృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రలోని పాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని రికార్డులు, ఐస్ లైన్డ్ రిఫ్రిజిరేటర్, వ్యాక్సిన్ నిల్వలను తనిఖీ చేశారు.

సమష్టి కృషితో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

మోత్కూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు సమష్టిగా కృషి చేస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్‌ను అందించవచ్చని మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభజస్టీస్ అన్నారు. బుధవారం కళాశాలలో నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు ఇంటి వద్ద చదువుకునేలా, మంచి నడవడిక నేర్చుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు కళాశాలలో కన్నా బయట ఉండే సమయమే ఎక్కువ అని, అప్పుడు వారు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు గమనించాలన్నారు. వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా తాము కృషి చేస్తున్నామని, అందుకు తల్లిదండ్రులు కూడా సహకరించాలన్నారు.

టాలెంట్ టెస్టులతో సృజనాత్మకత వెలుగులోకి..



చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులకు తరచుగా టాలెంట్ టెస్టులు నిర్వహించడం వల్ల వారిలో దాగి ఉన్న సృజనాత్మకత వెలుగులోకి వస్తుందని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మోత్కూరు ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 8. 9. 10 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన చెకుముకి సైన్సు టాలెంట్ టెస్టును ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సూరోజు భాస్కరాచారి, ఇన్‌చార్జి హెచ్‌ఎం డి.అరవిందరాయుడు, ఎ.వెంకటాచారి, సుధీర్‌కుమార్, లలితకుమారి, రాంప్రసాద్, రామకృష్ణ, ఉప్పలయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇంగ్లీష్ గ్రామర్ బుక్స్ అందజేత

మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మేక శశికుమార్ తన తండ్రి మాజీ సర్పంచ్ మేక రాజేశ్వర్‌రావు 29వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం ఆయన జ్ఞాపకార్థం హైస్కూల్లో 125 మంది ఎస్‌ఎస్‌సీ విద్యార్థులకు ఇంగ్లీష్ గ్రామర్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం డి.అరవిందరాయుడు, ఉపాధ్యాయులు ఎ.వెంకటాచారి, రాంప్రసాద్, ఉప్పలయ్య, వెంకటయ్య, రామకృష్ణ, రవికుమార్ పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజన' నిధులు పెంచాలి: ఎస్‌ఎఫ్‌ఐ



తుర్కపల్లి: ఎమ్మార్వో కేంద్రంలో వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

తుర్కపల్లి, వలిగొండ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నిధులు పెంచి వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి లావూడ్య రాజు ప్రభుత్వాని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎమ్మార్వో ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో పెరుగుతున్న ధరలకనుగుణంగా మధ్యాహ్న భోజనానికి నిధులు పెంచాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. పాఠశాలు, వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని కోరారు. అనంతరం ఎమ్మార్వోలో వినతి పత్రం అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి పోతరాజు జహంగీర్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు జగన్‌నాయక్, వెంకటేశ్, మల్లేశ్, రాజు, నరేశ్, దుర్గాప్రసాద్, జస్వంత్, భరత్, శ్రీకాంత్, వంశీ, సంపత్, మనికంఠ, సునీల్, మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

● అసంపూర్తిగా ఉన్న ఆదర్శ పాఠశాల బిల్డింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వేముల నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వలిగొండ మండలంలోని లోతుకుంట ఆదర్శ పాఠశాలలో ఎస్‌ఎఫ్‌ఐ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నరేందర్, ఫర్దీన్, భాను, వినయ్, సాయి పాల్గొన్నారు.


'బీజేపీ బలోపేతమే లక్ష్యంగా కృషి చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న అసెంబ్లీ ఇన్‌చార్జి శ్రీనివాస్

తుర్కపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ బలోపేతమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని బీజేపీ ఆలేరు అసెంబ్లీ ఇన్‌చార్జి చిరిగె శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఉన్న ప్రతి బూత్ పరిధిలో పార్టీ సభ్యత్వాలతోపాటుక్రియాశీలక సభ్యత్వాలను పూర్తి చేయాలని కోరారు. ఆ బూత్ పరిధిలో ఎవరైన 100 సాధారణ సభ్యత్వాలను పూర్తి చేసినట్లైతే వారికి క్రియాశీలక సభ్యత్వం ఇస్తారన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు బానోతు శత్రునాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు యాట పెంటయ్య, జిల్లా రిటర్నింగ్ అధికారి కానుగంటి శ్రీనివాస్, ఎస్టీ మోర్చ రాష్ట్రఅధికార ప్రతినిధి బానోతు నరేందర్‌నాయక్, జిల్లా కార్యదర్శి మేకల పాండు, మేకల శ్రీనివాస్ ఉన్నారు.

వైభవంగా ఉర్సు ప్రారంభం



చాదర్ సమర్పిస్తున్న ముస్లింలు

భువనగిరి గంజ్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): భువనగిరి పట్టణంలోని దర్గా హజ్రత్ సిరాజ్ ఉద్దీన్ ఓవొలియ ఖాద్రీ ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక మేమన్, గంజ్ మసీద్ ఆవరణలో ఈ ఉత్సవాలు సాయంత్రం ప్రత్యేక ప్రార్థన, భక్తి శ్రద్దలతో నాతె షరీఫ్, పరీష్, పతిస్తు గంధం ఊరేగింపు దర్గాలోకి ప్రవేశించింది. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దర్గా ముతవల్లి అమీన్ మెమన్, హనీఫ్ మెమన్, ఖాజా బషీర్‌ఉద్దీన్, షరీఫ్, ఇబ్రహీం, ఇంతియాజ్, ఇస్తియాజ్ పాల్గొన్నారు.

భూపోరాటంలో యాదగిరిది కీలకపాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి శ్రీరాములు

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సన్నకారు, చిన్నకారు రైతులు, పేదలకు ప్రభుత్వ భూముల పంపిణీ పోరాటంలో స్వాతంత్ర్య సమరయోధుడు గోద యాదగిరి కీలక పాత్ర పోషించారని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయం ఎదుట గోద యాదగిరి 25 వర్ధంతిని పురస్కరించుకుని స్మారకస్తూపం ఎదుట నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటయోధుడు ఆరుట్ల రాంచంద్రారెడ్డి నాయకత్వంలో యాదగిరి పనిచేశారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, మునిసిపల్ కో ఆప్షన్ సభ్యుడు పేరబోయిన పెంటయ్య, జిల్లా సమితి సభ్యుడు బబ్బూరి శ్రీధర్,మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు, గోపగాని రాజు, పేరబోయిన బంగారి, చెక్క వెంకటేష్, కొల్లూరి రాజయ్య, వేశాల అశోక్ పాల్గొన్నారు.

ఇళ్లపై ఎర్రజెండాలు ఎగురవేయాలి



జిల్లా మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

చౌటుప్పల్ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ పట్టణంలో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభల సందర్భంగా ఈ నెల 14వ తేదీన ప్రతి కార్యకర్త తమతమ ఇళ్లపై ఎర్ర జెండాలను ఎగురవేయాలని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి గోశిక కరుణాకర్ కోరారు. స్థానిక రంగారెడ్డి భవన్‌లో బుధవారం మహాసభల నిర్వహణకు సంబంధించి అనుసరించవలసిన వ్యవహారాలను చర్చించేందుకు సీపీఎం మునిసిపాలిటీ సమావేశాన్ని నిర్వహించారు. మహాసభల వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ, పార్టీ జిల్లా మహాసభల్లో భాగంగా మొదటి రోజు ఈ నెల 15న పట్టణంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 16, 17 తేదీల్లో ప్రతినిధుల సమావేశం ఉంటుందని తెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండి.పాషా, బండారు నర్సింహ, అవ్వారు రామేశ్వరి, నాయకులు బత్తుల దాసు, దాడి సురేందర్‌రెడ్డి, ఆకుల ధర్మయ్య, బొడ్డు అంజిరెడ్డి, పర్నే ధర్మారెడ్డి, బి.దశరథ, ఎండీ.రేష్మా పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



1979-80పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆలేరు రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆత్మీయ, అనురాగాలను పంచుకోవడం కోసమే ఆత్మీయ సమ్మేళనాలు ఎంతగానో దోహదపడుతున్నాయని రిటైర్డ్ ఎంఈవో అయిళ్ల రాంనర్సయ్య అన్నారు. బుధవారం మండలంలోని శారాజీపేటలో జరిగిన 1979-80 పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎంత ఎత్తుకు ఎదిగామన్నది ముఖ్యం కాదని తాము పుట్టి పెరిగిన గ్రామానికి, విద్యా బుద్ధులు నేర్చుకున్న పాఠశాలల అభివృద్ధికి ఎంత కృషి చేశామన్నదే ముఖ్యమన్నారు. 44 సంవత్సరాల అనంతరం ఆనాటి మధుర స్మృతులు గుర్తు చేసుకుంటూ పంచుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం ఆనాటి గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు అంజిరెడ్డి, ఇలాకాంతం, సుదర్శన్, పూర్వ విద్యార్థులు కురాకుల రాములు, భారతమ్మ, వాసుదేవరాజు, కెకె రాములు, భిక్షపతి, రవీందర్, వై.రాములు ఉన్నారు.

సంక్షిప్తంగా..

కృత్రిమ గర్భధారణతో మేలు జాతి దూడలు.. మోత్కూరు : పాడి పశువులకు కృత్రిమ గర్భదారణ చేయించినట్టయితే మేలు జాతి దూడలు పుడతాయని పశుసంవర్ధక శాఖ మోత్కూరు ఏడీ డాక్టర్ మోతీలాల్ అన్నారు. బుధవారం మండలంలోని సదర్శాపురం గ్రామంలో నిర్వహించిన ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో 39 ఎదకు రాని పశువులకు, 27 ఎదకు వచ్చినా గర్భం దాల్చని పశువులకు చికిత్స చేశారు. 125 పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు.

ఐఎన్‌టీయూసీ సమావేశం.. సంస్థాన్ నారాయణపురం: ఐఎన్‌టీయూసీ కమిటీ సమావేశం బుధవారం మండలంలోని కోతులాపురంలో జరిగింది. ఈ సందర్భంగా గ్రామశాఖ అధ్యక్షుడిగా ఈదులకంటి జంగయ్యను నియమిస్తూ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు కరంటోతు ప్రజ్ఞానాయక్, మండల అధ్యక్షుడు దౌల గణేష్ నియామకపత్రం అందజేసారు. ఐఎన్‌టీయూసీ నాయకులు కురిమిద్ద గోపాల్, పులమోని శంకర్, సుక్క శ్రీను, దుర్గం గాలయ్య, పాషా, పొట్ట వెంకటేష్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి.. ఆలేరు: ఆలేరు పరిసర ప్రాంతాల ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు పెంపొందించాలని ఆలేరు స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కోరారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన చెందిన అర్పిత, నర్సింగ్ వైద్యుడు కేప్రభాకర్ బుధవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనను ఘనంగా సన్మానించారు. ఆయన వెంట మండల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కే వెంకట్వేరరాజు, ఎంఎల్ యాజాద్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, రాము, అనిత, ముదికొండ శ్రీకాంత్, ఆలేటి అనిల్, సతీష్, మన్నె సంతోష్, వెంకటేష్ ఉన్నారు.

పద్మశాలి సంఘం రాష్ట్ర కమిటీలో ప్రాధాన్యం.. ఆలేరు: పద్మశాలి సంఘం రాష్ట్ర కమిటీలో ఆలేరుకు ప్రాధాన్యం కల్పించి ఇరువురిని కమిటీలోకి తీసుకోవడం పట్ల సంఘం పట్టణ కమిటీ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన పాచికంటి శ్రీనివాస్, కార్యనిర్వహక కార్యదర్శిగా ఎన్నికైన ఆడెపు బాలస్వామిని కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి అభినందించారు.

ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గాదె సోమిరెడ్డి .. ఆలేరు రూరల్: ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని కొలనుపాక గ్రామానికి చెందిన గాదె సోమిరెడ్డి నియమితులయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయనను రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. సోమిరెడ్డిని పలువురు ఈ సందర్భంగా అభినందించారు.

ఉపాధ్యాయుడు మహేష్‌కు డాక్టరేట్.. అడ్డగూడూరు: వలిగొండ మండలం పల్లెర్ల ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న మండలంలోని జానకీపురం గ్రామవాసి బోనాల మహేష్ ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ అందుకున్నారు. ఈ మేరకు బుధవారం ప్రొఫెసర్లు లక్ష్మీశ్రీకాంత్ రాథోడ్, రాజేష్ కుమార్, దీప్తా చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు.

సీపీఐ సీనియర్ నేత చేరాల నర్సింహ కన్నుమూత

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు చేరాల నర్సింహ బుధవారం ఆకస్మికంగా కన్నుమూశారు. సీపీఐ మండల కార్యదర్శిగా రెండు దఫాలుగా పనిచేశారు. అంతేగాక ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా, భూదాన్‌పోచంపల్లి భవన నిర్మాణ సంఘం గౌరవాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. నర్సింహ మరణం సీపీఐ పార్టీకి తీరని లోటు అని సీపీఐ మండల కార్యదర్శి గోడల్ల నాగభూషణ్‌గౌడ్ అన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సుమంత్, డాక్టర్ ర్యాకల శ్రీనివాస్

భువనగిరి రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ అన్నారు. బుధవారం భువనగిరి మండలం తాజ్‌పూర్ గ్రామంలో డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ సొంత ఖర్చులతో డాక్టర్ సుమంత్ కంటి ఆసుపత్రి సహకారంతో గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సుమారు 110 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమున్న 69మందికి ఉచిత కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గ్రామస్థులకు వైద్య ఆరోగ్య సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. పంచాయతీ కార్యదర్శి జి.నర్సింగరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జనగాం పాండు, నీలకంఠం ప్రకాశ్, పి.కిరణ్, రాజు, యాకూబ్ పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి విరాళం



ఆర్థిక సాయం అందజేస్తున్న వివేకానంద పాఠశాల విద్యార్థులు

రామన్నపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఐటీఆర్‌ఆర్‌వోడీడీ సంస్థ హైదరాబాద్ వారు సోచ్ ఫౌండేషన్ ద్వారా అందుల అనాథలకు వివిధ వృత్తి విద్యా కోర్సులు అందిస్తూ ఎన్నో రకాల సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నిర్మించే అందుల అనాథాశ్రమం విరాళంగా స్థానిక మండల కేంద్రంలోని వివేకానంద హైస్కూల్ విద్యార్థులు అక్షరాల రూ.1,08,671 సంస్థకు అందించారు. ప్రిన్సిపాల్ తిరుగుడు మల్లికార్జున్, సంస్థ అభినందించారు.

కాళోజీ ఆశయ సాధనకు కృషి చేయాలి



కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మోత్కూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాళోజీ నారాయణరావు ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ కోరారు. బుధవారం కాళోజీ వర్ధంతి సందర్భంగా మోత్కూరులో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నిలిగొండ మత్స్యగిరి, చెరుకు ఉప్పలయ్య, కోల రాములు, బొబ్బలి బిక్షం, బోడ శ్రీరాములు, యాకస్వామి పాల్గొన్నారు.